


నువ్వా.. నేనా..!

కూటమి వర్సెస్ వైసీపీ

నామినేషన్ల పర్వం ప్రారంభం.. ఇక ప్రచారం ఉధృతం
మూడు వారాలపాటు కార్యక్షేత్రంలో రణరంగమే !

ఎన్నికల రణరంగంలో తాడోపేడో తేల్చుకోవడానికి రాబోయే మూడు వారాలే కీలకం. ఒకవైపు కూటమి అభ్యర్థులు, ఇంకో వైపు అధికార వైసీపీ, మరో వైపు ఇండిపెండెంట్‌లు మోహరిస్తున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడటంతో ఇప్పటి వరకు జరిగిన తంతు ఒక ఎత్తు, ఇకపై జరగబోయేది ఇంకో ఎత్తు. అభ్యర్థుల రోజు వారి కదలికలపై ఎన్నికల నిబంధనల నీడ వెన్నాడుతూనే ఉంటుంది. ఇప్పటికే కొందరు అభ్యర్థులు అయితే దీన్ని దృష్టిలో పెట్టుకుని అన్ని సర్దేసినట్లు చెబుతున్నారు. సామాజిక వర్గాలు, మహిళా గ్రూపులు, యువత టార్గెట్‌గా అంతా వ్యవహారం సాగుతోంది. ఎంపీ అభ్యర్థులే ఈ సారి అత్యంత కీలకం. ప్రత్యేకించి మండుటెండ అయినా సరే ఏ మాత్రం అదరకుండా బెదరకుండా ప్రచారం హోరెత్తిస్తూనే ఉన్నారు. బలం, బలహీనతలను పూర్తిగా అంచనా వేసుకునే పనిలో పడ్డారు.

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

ఇప్పటి వరకు ఒక లెక్క. ఇకపై మరో లెక్క. సార్వత్రిక ఎన్నికలకు ప్రధాన అభ్యర్థులు సై అంటున్నారు. నామినేషన్ సమయంలోనే తమ బలాన్ని, బలగాన్ని నిరూపించుకోవడానికి సంసిద్ధులవుతున్నారు. అభ్యర్థులు ముహూర్తాలు ఖరారు చేసుకున్నారు. తిథి, ఘడియలు లెక్క కట్టుకుని మరీ అడుగులు కదుపుతున్నారు. ఇప్పటికే తెలుగుదేశం కూటమి, వైసీపీ అభ్యర్థులను ఖరారు చేశాయి. కూటమి తరపున ఒక్క ఉండి నియోజకవర్గంలోనే కాస్త సస్పెన్స్ నెలకొంది. మిగిలిన అన్నిచోట్లా అభ్యర్థులు అలుపెరగని ప్రచారం చేస్తున్నారు. ఇప్పటి వరకు ఆత్మీయ సమావేశాలు, పాదయాత్రలతో అన్ని వర్గాలను కలుసుకునే ప్రయత్నం చేశారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల అయినప్పటి నుంచి వ్యూహాలు, ప్రతివ్యూహాలతో ముందుకు సాగారు. సర్వేలు నిర్వహించుకున్నారు. గ్రామాలు, వార్డుల వారీగా తమ బలం. బలహీనతలను బేరీజు వేసుకోవడానికి సొంత సర్వే బృందాలను ఏర్పాటు చేసుకున్నారు. వారి సూచనలకు అనుగుణంగా పరిస్థితులను తమకు అనుకూలంగా మలచుకుంటున్నారు. ఎన్నికల్లో ముందుకు సాగుతున్నారు.

పట్టుబిగించిన కూటమి

జిల్లాలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి మొదట్లో కాస్త ఒడిదుడుకులకు లోనైనా.. వీటిని సవరించుకునేందుకు ఎన్నికలకు కాస్త సమయం దొరికింది. దీనితో అసంతృప్తులు ఒక్కొక్కరిని పిలిచి అధిష్టానం మాట్లాడింది. దీంతో మూడు పార్టీల నాయకులను ఏకతాటిపైకి తెచ్చారు. స్పర్థలను పక్కన పెట్టారు. అభ్యర్థులు ప్రకటించిన తర్వాత అంతా ఒక్కటయ్యారు. నరసాపురం మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడును సైతం తెలుగుదేశం క్రియాశీలంగా రంగంలోకి దింపింది. మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు సైతం కూటమి అభ్యర్థి బొమ్మిడి నాయకర్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్నారు. తణుకులో ఆరిమిల్లి రాధాకృష్ణకు జనసేన ఇన్‌ఛార్జ్ నుంచి మద్దతు లేకపోయినా సరే ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎన్నికల కదన రంగంలోకి దూకారు. తాడేపల్లిగూడెంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ అంతా ఒక్క మాట మీదే ఉంటున్నారు. వైసీపీ నుంచి టీడీపీ, జనసేన పార్టీల్లోకి నాయకులను చేర్చుకుంటూ అధికార పార్టీని బలహీనపరిచే ప్రయత్నం చేస్తున్నారు. భీమవరం నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే అంజిబాబును జనసేన నుంచి కూటమి అభ్యర్థిగా బరిలో దింపడంతో అక్కడ మూడు పార్టీలు గెలుపు కోసం సన్నద్ధమయ్యాయి. అన్ని వర్గాల నుంచి మద్దతును కూడగట్టుకుంటున్నాయి. గెలుపే ధ్యేయంగా పనిచేస్తున్నారు. ఆచంటలో మాజీమంత్రి పితాని పాదయాత్రతో అన్ని గ్రామాలను చుట్టుముట్టారు. ఆచంట జనసేన ఇన్‌ఛార్జ్ చేగొండి సూర్యప్రకాష్ రాజీనామా చేసిన సరే అక్కడ జనసేన కేడర్ అంతా పితాని వెంట నడుస్తోంది. పాలకొల్లు నియోజకవర్గంలో ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు ప్రతి గ్రామంలోనూ పాదయాత్ర ద్వారా సుడిగాలి పర్యటన చేశారు. ఇంటింటా ప్రచారాన్ని పూర్తిచేశారు. ఇకపై ప్రతి నియోజకవర్గంలోనూ మూడు పార్టీల అభ్యర్థులు కలసి వాహనాల్లో గ్రామాలు, పట్టణాల వారీగా ప్రచారం చేసేందుకు ప్రణాళిక చేసుకున్నారు. ప్రతి నియోజకవర్గంలోనూ అధికార పార్టీ నాయకులు అవినీతి, అక్రమాలు, కక్ష పూరిత చర్యలు, అభివృద్ది లేమి తదితర అంశాలను ఎండగడుతూ ముందుకు సాగుతున్నారు.



ఉండిలో ఇంకా ఉత్కంఠే

ఉండిలో కూటమి అభ్యర్థికి ఉత్కంఠ వీడలేదు. నర్సాపురం బీజేపీ ఎంపీ అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాస్‌వర్మకు బి ఫాంను అందజేశారు. దీంతో రఘురామకృష్ణంరాజుకు ఎంపీ స్థానం మరి లేనట్టే. అదే జరిగితే ఉండిలో అసెంబ్లీ అభ్యర్థిగా రంగంలోకి దింపనున్నట్టు టీడీపీ అధినేత చంద్రబాబు హామీ ఇచ్చారు. ఈ నెల 22న రఘురామకృష్ణంరాజు ఉండిలో నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఎమ్మెల్యే మంతెన రామరాజు ఆదేరోజు నామినేషన్ వేస్తానంటూ ప్రకటించారు. అధిష్ఠానం ఇచ్చే స్పష్టతపై ఒక్కరు మాత్రమే నామినేషన్ దాఖలు చేసే అవకాశం ఉంటుందని టీడీపీ వర్గాలు విశ్వసిస్తున్నాయి.

వలంటీర్లపై ఆధారపడుతున్న వైసీపీ అభ్యర్థులు

వలంటీర్ వ్యవస్థ అమలులోకి వచ్చిన తర్వాత వైసీపీలో కార్యకర్తలకు పనిలేకపోయింది. ఏ పనైనా ఎమ్మెల్యేలు వలంటీర్ల ద్వారా చేయిస్తూ వచ్చారు. సమావేశాలకు జనాలను రాబట్టడంలోనూ వలంటీర్లే కీలకంగా వ్యవహరించారు. దీంతో పార్టీకి, నాయకులకు, కేడర్‌కు మధ్య అంతరం పెరిగింది. ఇప్పుడు కార్యకర్తలు దూరమయ్యారు. ప్రతి నియోజకవర్గంలోనూ అధికార పార్టీని నాయకులు వీడుతున్నారు. కూటమిలో చేరుతున్నారు. దీంతో అధికార పార్టీ అభ్యర్థులు వలంటీర్లను నమ్ముకుంటున్నారు. రాజీనామాలు చేయాలని ఒత్తిడి చేస్తున్నారు. ఇప్పటికే రాజీనామాలు చేసిన వలంటీర్లను ప్రచారంలోకి వచ్చేలా ప్రణాళిక రచించుకున్నారు. నామినేషన్‌లకు హాజరు కావాలని వర్తమానం పంపారు. మరోవైపు గ్రామాల్లో కాస్త ఓటు బ్యాంకు ఉన్న నాయకులు, ప్రజా సంఘాలకు ప్యాకేజీలు ఆఫర్ చేస్తున్నారు. ఒకవైపు వలంటీర్లు, మరోవైపు సొమ్ములు వెదజల్లి ఎన్నికలను నెగ్గుకు రావాలని వైసీపీ అభ్యర్థులు వ్యూహాలు పన్నుతున్నారు. ప్రభు త్వం అమలుచేసిన సంక్షేమ పథకాలే తమను గట్టెక్కిస్తాయని విశ్వసిస్తున్నారు. వైసీపీలో ఏడు నియోజకవర్గాల్లోనూ అభ్యర్థులను సీఎం జగన్ సిద్ధం సభలో ప్రకటించి మార్పులు, చేర్పులు ఊహాగానాలకు తెరదించారు. అదే ఇప్పుడు ఎన్నికలు కత్తి మీద సాముగా మారాయి. కేడర్ ఇప్పుడు కరువై అధికార పార్టీ అభ్యర్థులను కలవరపెడుతోంది.



నరసాపురం ఎంపీ స్థానానికి నామినేషన్ పత్రాలను కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు అందజేస్తున్న ఐఎన్‌సీ అభ్యర్థి

లెక్కలు తప్పనిసరి

ఇప్పటి వరకు ఎన్నికల నోటిఫికేషన్ లేదు. అభ్యర్థుల ఎన్నికల ఖర్చులు లెక్కలోకి రాలేదు. ఇకపై జెండా నుంచి వాహనాల వరకు ఎన్నికల అధికారులు లెక్కలు వేస్తారు. ప్రచారంలో వాహనాలు, జెండాలు, మైక్‌లకు అనుమతులు తీసుకోవాలి. ప్రచారంలో పాల్గొనాలి. వీటిని అధిగమించేందుకు అభ్యర్థులు తమ బంధుగణాలను రంగంలోకి దింపుతున్నారు. అభ్యర్థుల సతీమణులు, వారసులు ఇంటింటా తిరిగి ఓటర్లను కలుసుకుంటున్నారు. గతంలో పెయిడ్ వర్కర్‌ల ద్వారా ప్రచారాలు చేపట్టేవారు. శిబిరాల వద్ద భోజనాల కోలాహలం ఉండేది. ఈ సారి అత్యధిక అభ్యర్థులు పొదుపు మంత్రాన్ని పాటిస్తున్నారు. తాయిళాలు ఇచ్చేందుకు నిధులు సమకూర్చుకుంటున్నారు.

నామినేషన్ కౌంటర్ (1వ రోజు)

అసెంబ్లీ నియోజకవర్గం	తొలి రోజు నామినేషన్లు	మొత్తం
1.ఆచంట	00	00
2.పాలకొల్లు	00	00
3.నరసాపురం	00	00
4.భీమవరం	00	00
5.ఉండి	00	00
6.తణుకు	00	00
7.తాడేపల్లిగూడెం	00	00
8.ఉంగుటూరు	00	00
9.దెందులూరు	01	01
10.ఏలూరు	01	01
11.పోలవరం	02	02
12.చింతలపూడి	00	00
13.నూజివీడు	02	02
14.కైకలూరు	00	00
మొత్తం	06	06
పార్లమెంట్ నియోజకవర్గం	**తొలి రోజు నామినేషన్లు**	**మొత్తం**
1.నరసాపురం	01	01
2.ఏలూరు	00	00
మొత్తం	01	01

నామినేషన్లకు శ్రీకారం

- నరసాపురం పార్లమెంట్ స్థానానికి ఒకటి, అసెంబ్లీ స్థానాలకు సున్నా

భీమవరం టౌన్, ఏప్రిల్ 18 : సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో గురువారం నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. నరసాపురం పార్లమెంటరీ నియోజకవర్గానికి సంబంధించి ఒక నామినేషన్ దాఖలు కాగా, ఏడు అసెంబ్లీ నియోజక వర్గాలకు సంబంధించి ఒక్కటి కూడా రాలేదని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరు సుమిత్‌కుమార్ వెల్లడించారు. నరసాపురం ఎంపీ స్థానానికి ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా అత్తిలి మండలం ఆరవల్లికి చెందిన సత్తి సూర్యనారాయణరెడ్డి ఒక సెట్ నామినేషన్ పత్రాన్ని భీమవరం కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారి, నరసాపురం పార్లమెంటరీ నియోజకవర్గ ఆర్వో సుమిత్ కుమార్‌కు అందజేశారు.

తణుకులో వైసీపీకి బిగ్‌షాక్

- అధికార పార్టీకి నాయకులు, కార్యకర్తల రాజీనామా..
- ఆరిమిల్లి సమక్షంలో టీడీపీలో చేరిక



టీడీపీలో చేరిన కె.కుముదవల్లి గ్రామ వైసీపీ నాయకులు

ఇరగవరం/అత్తిలి, ఏప్రిల్ 18 : తణుకు నియోజకవర్గంలో వైసీపీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. ఇరగవరం మండలం కె.కుముదవల్లికి చెందిన 60 మంది నాయకులు, కార్యకర్తలు వైసీపీ రాజీనామా చేసి తణుకు మాజీ ఎమ్మెల్యే, కూటమి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ సమక్షంలో టీడీపీలో చేరారు. అత్తిలి, దువ్వ, వరిఘేడులకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు కూడా టీడీపీలో చేరారు. ప్రతి ఒక్కరికి సముచిత ప్రాధాన్యం ఇస్తామని ఆరిమిల్లి వారికి భరోసా ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వం అనుసరిస్తున్న అప్రజాస్వామిక విధానాలు, స్థానికంగా మంత్రి కారుమూరి నియంతృత్వ పోకడలతో ప్రజలు విసిగిపోయారని ఆయన పేర్కొన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. తణుకులో అధికార పార్టీ అవినీతి పెరిగిపోయింది. నిజాయితీతో కూడిన అభివృద్ధి, సంక్షేమ పాలనకోసం ప్రజలంతా కూటమికి మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. గడచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం పదిశాతం హామీలు నెరవేర్చలేకపోయిందని విమర్శించారు. రోజు రోజు కూ ప్రజల నుంచి, అన్ని వర్గాల నుంచి టీడీపీ కూటమికి మద్దతు పెరుగుతోందని సంతృప్తి వ్యక్తం చేశారు. నాయకులు బసవ శంకరం, బసవ నాగేశ్వరరావు, ఒరిసి నాగు, కడలి నరసింహమూర్తి, త్యాగాల వెంకట్రావు, బొబ్బిలి వెంకటకృష్ణ, బొబ్బిలి చిన్నారావు, తణుకు మండల అధ్యక్షుడు పితాని మోహన్, కట్టా సూర్యారావు, మంగ ఇమ్మానుయేల్, శ్రీనివాసరావు, కరుటూరి సర్వేశ్వరరావు, కొనాల మల్లికార్జునరావు, తోట వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు ఆరిమిల్లి నామినేషన్

టీడీపీ అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ శుక్రవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఉదయం 9.30 గంటలకు పాలంగిలోని తమ నివాసం నుంచి ర్యాలీగా బయలుదేరి వెళతారు. ఈ కార్యక్రమాన్ని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు విజయవంతం చేయాలని ఆరిమిల్లి కోరారు.

మంత్రి కారుమూరి వల్లే పార్టీకి రాజీనామా - చిట్టూరి సునంద -7లో

సీఎం బస్సు యాత్రతో జనం పాట్లు



తేతలిలో సీఎం జగన్‌ను కలిసేందుకు వచ్చిన మహిళను నెట్టేస్తున్న పోలీసులు

ఇరగవరం/పెనుగొండ, ఏప్రిల్ 18 : సీఎం జగన్ మూడు రోజుల ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పర్యటన గురువారం ముగిసింది. 'మేమంతా సిద్ధం' పేరిట ఆయన మంగళవారం భీమవరంలో బహిరంగ సభ నిర్వహించి రాత్రికి తణుకు మండలం తేతలిలో బస చేశారు. బుధవారం యాత్రకు విరామం ప్రకటించి గురువారం ఉదయం 11 గంటలకు తిరిగి తూర్పు గోదావరి వైపు యాత్రను కొనసాగించారు. అయితే ఉదయం సీఎంను కలిసేందుకు పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. పోలీసులు వారిని ఆయన వద్దకు వెళ్లనివ్వలేదు. ఓ మహిళను అయితే బయటకు నెట్టేశారు. జాతీయ రహదారి వెంబడి వున్న పార్టీ నాయకులు, కార్యకర్తలకు జగన్ బస్సులో నుంచే అభివాదం చేసుకుంటూ ముందుకు సాగారు. తేతలి, తణుకు వై.జంక్షన్, ఉండ్రాజవరం జంక్షన్, పెరవలి, సిద్ధాంతం మీదుగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోకి ప్రవేశించింది. షరిష్ట కూడలి వద్ద జగన్ కిందికి దిగి పలువురి నుంచి వినతులు స్వీకరించారు. పెరవలిలో జన మూహం తక్కువగా ఉండడంతో బస్సు నుంచే అభివాదం చేశారు. ఈ బస్సుయాత్ర జాతీయ రహదారి మీదుగా కావడంతో దూర ప్రయాణం చేసేవారు ప్రతి కూడలిలో చాలా సేపు ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో వాహనదారులు హారన్ మోగిస్తూ అసహనం వ్యక్తం చేశారు. సిద్ధాంతం కూడలి వద్ద పోలీసులు ట్రాఫిక్‌ను నిలిపివేయడంతో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. ట్రాఫిక్‌లో 108 అంబులెన్స్ చిక్కుకుపోయింది. పోలీసులు, యువకులు వాహనాలను తప్పిస్తూ అంబులెన్సును ముందుకు పంపించారు.



తణుకు వై జంక్షన్ వద్ద..





ఆ ఎంఈవో తీరే అంత

- గణపవరం ఎంఈవో శేషు రూ.3.80 లక్షలు అవకతవకలకు పాల్పడ్డారని ఎస్టీయూ ఫిర్యాదు
- ఖండించిన ఎంఈవో.. విచారణ చేపడతామన్న డీఈవో



డీఈవో అబ్రహంకు వినతిపత్రం అందజేత

ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 18 : గణపవరం ఎంఈవో-1 పి.శేషు పనితీరుపై సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) రాష్ట్ర, జిల్లా శాఖ నాయకులు గురువారం డీఈవో అబ్రహంకు ఫిర్యాదు చేశారు. ఎంఈవో అక్రమ వ్యవహారాలపై డీఈవోకు అందజేసిన ఫిర్యాదు నకళ్ళను ఇక్కడి పత్రికలకు అందజేశారు. దీనిపై డీఈవో అబ్రహంను వివరణ కోరగా ఎస్టీయూ నాయకులు చేసిన ఆరోపణలపై విచారణ నిర్వహించనున్నట్టు వెల్లడించారు. తాను ఎటువంటి అక్రమాలకు పాల్పడలేదని, ఎంఈవోగా పనిచేసిన మండలాలన్నింటిలో చేపట్టిన అన్ని ఆర్థిక కార్యకలాపాలకు బిల్లులు ఆడిట్ కావడంతోపాటు, విచారణలో వాటిని ఉన్నతాధికారులకు అందజేస్తానని ఎంఈవో పి.శేషు వివరించారు. ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి నారాయణ, జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.శామ్యూల్, కె.ఆర్.పవన్ కుమార్ ఎంఈవోపై చేసిన ఫిర్యాదు ముఖ్యాంశాలివి.

శేషు గణపవరం ఎంఈవోగా పనిచేస్తున్న కాలంలో అత్తిలి ఎంఈవో పేరిటవున్న బిల్లులను అప్‌లోడ్ చేసి రూ.60 వేలను తన ఖాతాలో జమ చేసుకున్నారు. ఎంఆర్‌సీ గ్రాంట్లు, శాలసిద్ధి గ్రాంట్లను కాజేశారు. నిడమర్రు ఎంఈవోగా పనిచేసిన కాలంలో సంతకాలను ఫోర్జరీ చేసి క్రమశిక్షణారాహిత్యానికి పాల్పడి నిధులను సొంత ఖాతాలో వేసుకున్నారు. స్పోర్ట్స్ గ్రాంట్లు, ఎంఆర్‌సీ గ్రాంట్ల బిల్లులను అప్‌లోడ్ చేయకుండా స్వాహా చేశారు. సమగ్ర అభ్యసనాభివృద్ధి పథకం(క్లాప్) శిక్షణ నిమిత్తం ప్రభుత్వం విడుదల చేసిన నిధులను నకిలీ బిల్లులు సృష్టించి సొంత ఖాతాకు మళ్ళించారు. నల్లజర్ల ఎంఈవో(ఎఫ్ఏసీ)గా పనిచేసిన కాలంలో ఎంఆర్‌సీ గ్రాంట్లు రూ.57 వేలు పూర్తిగా వినియోగించకుండా వాడేసుకున్నారు. శేషుపై చేసిన ఫిర్యాదుకు సంబంధించిన సీఎఫ్ఎంఎస్ బిల్లుల ఐడీలను, వివరాలను ఎనెగ్జర్‌లో పొందుపర్చాం. రూ.3.80 లక్షలను దుర్వినియోగం చేశారు. ఆ ప్రకారం నకిలీ బిల్లులను సీఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్ చేసి ప్రభుత్వ నిధులను సొంత ఖాతాకు జమ చేసుకున్న ఎంఈవో శేషుపై నిర్వహించే విచా రణకు తాము పూర్తిగా సహకరిస్తామని ఎస్టీయూ నాయకులు డీఈవోకు వివరించారు. ఆయనపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



బైరాగిమఠంలో రథోత్సవం

పెంటపాడు, ఏప్రిల్ 18 : కే.పెంటపాడు బైరాగిమఠం గోపాలస్వామి, ఆంజనేయస్వామి ఆలయంలో జరుగుతున్న శ్రీరామనవమి ఉత్సవాలలో గురువారం రథోత్సవం నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు త్రిలోచదాస్, సహ అర్చకులు పూర్ణచంద్రత్రిపాఠి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. మేళతాళాలు, బాణసంచా కాల్పుల నడుమ ప్రత్యేకంగా అలంకరించిన రథంపై స్వామికి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ ఫిట్‌పర్సన్ రవిశంకర్ మాట్లాడుతూ శుక్రవారం స్వామి వారికి తెప్పోత్సవం, ఊరేగింపులు జరుగుతాయని తెలిపారు.


అంజిబాబు గెలుపుతోనే భీమవరం అభివృద్ధి

- టీడీపీ, జనసేన జిల్లా అధ్యక్షులు తోట, కొటికలపూడి



అంజిబాబుతోపాటు కూటమి నాయకుల భారీ ర్యాలీ

భీమవరం టౌన్, ఏప్రిల్ 18 : భీమవరం అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) గెలుపుతోనే భీమవరం అభివృద్ధి చెందుతుందని టీడీపీ జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి, రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వర రావు, కోశాధికారి మెంటే పార్థసారథి, జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి చిన బాబు అన్నారు. వీరవాసరం మండలం నేల పోగుల నుంచి గురువారం ఎమ్మెల్యే అభ్యర్థి అంజిబాబు ఆధ్వర్యంలో కూటమి నాయకులు ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ 'అంజిబాబు సౌమ్యుడు, మంచివాడు. అందరికీ అందుబాటులో ఉంటాడు. రాజకీయ కక్షలు ఉండవు. వేధింపులుండవు. ఆయన గెలుపుతోనే నియోజకవర్గం అభివృద్ధి చెందుతుంది' అని వివరించారు. భీమవరంలో బీసీ, ఎస్సీ సామాజికవర్గాలతో ఏర్పాటు చేసిన రాజా ట్రస్ట్ అంజిబాబుకు సంపూర్ణ మద్దతు ప్రకటించింది. సమావేశానికి 1300 మంది హాజరై సంఘీభావం ప్రకటించారు. కొమరాడ వైసీపీ సర్పంచ్ రాట్నాల రాజా 200 మంది అనుచరులు, కార్యకర్తలతో చినబాబు, అంజిబాబు సమక్షంలో జనసేనలో చేరారు. చిన అమిరంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో క్షత్రియ సామాజిక వర్గానికి చెందిన ముఖ్యులు మద్దతు ప్రకటించారు. భీమవరం ప్రాంతంలో ఆక్వా, వ్యాపార రంగాల అభివృద్ధికి శాయశక్తులా పనిచేస్తానంటూ అంజిబాబు హామీ ఇచ్చారు.



21, 22 తేదీల్లో పవన్ కల్యాణ్ పశ్చిమకు రాక




19, 22, 23, 24, 25 తేదీల్లో నామినేషన్లకు ముహూర్తాలు


మరిన్ని రాజకీయ వార్తలు.. జన కేతనం పేజీల్లో..

జగన్మోసం


టిడ్కో ఇళ్లు


ఎర్రకాలువ జలాశయం


కూలిన బైనేరు వంతెన (ఫైల్)


చింతలపూడిలో వెలగని వీధిలైట్లు

సమస్యలతో సతమతం

చింతలపూడి


నిలిచిపోయిన చింతలపూడి ఎత్తిపోతల కాల్వ పనులు

చింతలపూడి నియోజకవర్గ కేంద్రంలో అన్నీ చింతలే.. తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, మురుగుతో పట్టణ ప్రజలు ఏళ్ల తరబడి ఇబ్బందులు పడుతున్నారు. నియోజకవర్గంలో మరో పట్టణం జంగారెడ్డిగూడెంలో ఏళ్ల తరబడి సమస్యలు విలయతాండవం చేస్తున్నాయి. సీఎం జగన్‌మోహన్ రెడ్డి, వైసీపీ నేతలు 2019 ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయలేదు. ప్రస్తుతం అవే హామీలతో ప్రచారానికి దిగడం విడ్డూరం. జంగారెడ్డిగూడెం పట్టణంలో తాగునీరు, అంతర్గత రహదారులు, డ్రెయినేజీ రోడ్ల సమస్యలు అసంపూర్తిగా ఉన్నాయి. కామవరపుకోట, లింగపాలెం మండలాల్లో సైతం హామీలు అమలు కాలేదు.. సమస్యలు పరిష్కారం కాలేదు.

- చింతలపూడి, జంగారెడ్డిగూడెం, లింగపాలెం

- టిడ్కో ఇళ్లు ఇవ్వలేదు
- ఎత్తిపోతల పథకం ముందుకు సాగలేదు
- ఎర్ర కాలువ కష్టాలు
- అసంపూర్తిగా పట్టెన్నపాలెం బ్రిడ్జి
- ఆర్టీసీ బస్ డిపో కలే..

చింతలపూడి ఉత్తిపోతలు..!

గోదావరి నీటిని ఎత్తిపోతల ద్వారా మళ్లించి సాగు, తాగునీరు ఇవ్వాలని 2006లో ఈ పథకానికి అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి శ్రీకారం చుట్టి 1701 కోట్లు కేటాయించారు. 2014లో ఈ పథకాన్ని టీడీపీ ప్రభుత్వం విస్తరించి కృష్ణా జిల్లా మెట్ట ప్రాంతాలకు మళ్లించాలని 3వేల కోట్లతో పనులు చేపట్టారు. వైసీపీ ప్రభుత్వంలో నాబార్డు నుంచి రూ.1950 కోట్లు రుణం పొందినా ఈ పథకాన్ని పూర్తి చేయలేదు. పాదయాత్రలో జగన్ ఇచ్చిన హామీ నిలబెట్టుకోలేదు. పరిహారం పెంచి ఇవ్వాలన్న రైతుల డిమాండ్ నెరవేరక ఇప్పటికీ పోరాటాలు చేస్తూనే ఉన్నారు. ఇటీవల నిర్మాణం నిలిచిపోయిన కాలువ మట్టిని కూడా ప్రభుత్వం అమ్ముకుంటోంది.

ఎక్కడి టిడ్కో అక్కడే..

పేదల ఇంటి కల నిజం చేయడానికి తెలుగుదేశం ప్రభుత్వం నిర్మించిన టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందించడంలో వైసీపీ ప్రభుత్వం విఫలమైంది. జంగారెడ్డిగూడెంలో 2016లో 864 టిడ్కో గృహ సముదాయాల నిర్మాణం చేపట్టారు. 2019 ఎన్నికల సమయానికి నిర్మాణం చివరి దశకు వచ్చింది. నాటి నుంచి పనులు అడుగు కూడా ముందుకు కదల్లేదు. వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి తేదీలు మార్చుతూ ప్రజలను మభ్య పెట్టింది. రంగులు మార్చి రిజిష్ట్రేషన్ పేరుతో పేదలను మోసం చేశారు.

బైనేరు వంతెన కూలి ఆరేళ్లు..

2018 ఆగస్టులో కురిసిన భారీ వర్షాలకు బైనేరు వంతెన కుప్పకూలింది. బ్రిటీష్ కాలంలో నిర్మించిన 125 ఏళ్ల వంతెన తెగిపోవడంతో వాహనదారుల ఇబ్బందులు అన్నీ ఇన్ని కావు. నూతన బ్రిడ్జి నిర్మాణం సంగతి పక్కనపెడితే, స్థానిక ప్రజాప్రతినిధులు పడిపోయిన బ్రిడ్జి మరమ్మతు చేయిస్తామంటూ ప్రకటనలు చేశారు. ఇప్పటికి కూలిన బ్రిడ్జి శిథిలాలు మాత్రమే తొలగించారు.

స్వచ్ఛ లక్కవరం జాడ లేదు

జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం గ్రామానికి ప్రత్యేకత ఉంది. 18వేల మంది జనా భా, 8వేల పైచిలుకు ఓట్లు ఒక్క లక్కవరం లో ఉన్నాయి. నాయకులు ఓట్ల కోసం లక్కవరం గ్రామాన్ని స్వచ్ఛ గ్రామంగా చేసి చూపిస్తామంటూ హామీలు గుప్పిం చారు. తీరా చెత్త సేకరణ వాహనాలు లేక చెత్త లక్కవరంగా మా రిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నా రు. పాత డంపింగ్ యార్డు ఉన్న ప్పటికి కొత్త డంపింగ్ యార్డు నిర్మాణం చేపట్టారు. రెండు డం పింగ్ యార్డులను వినియోగిం చకపోగా రోడ్డుపైనే చెత్తను కుప్పలుగా పేర్చి తగలబెడుతున్నారు.

ఎర్రకాలువ ఆధునీకరణ లేదు

ఎర్రకాలువ జలాశయం ఆధునీకరణ చేస్తా మని సీఎం హామీ ఇచ్చారు. కనీస మరమ్మ తులు కూడా చేయించ లేదు. ప్రాజెక్టు కనీస నిర్వహణ లేదు. ఎర్రకాలువ సాగు పరిధి పెంచాల్సిన అవసరం ఉందని తెలిసినా పట్టించుకోవడం లేదు. వైసీపీ ప్రభుత్వం తాగునీరు, సాగునీరు ప్రాజెక్టులను పట్టించుకోదని రైతులు వాపోతున్నారు.

8 ఏళ్లుగా నిర్మాణం..

2016లో ప్రారంభించిన పట్టెనపాలెం బ్రిడ్జి నిర్మాణం పూర్తి కాలేదు. జల్లేరువాగుపై పట్టెన్నపాలెం బ్రిడ్జి గుండా గుబ్బల మంగ మ్మ ఆలయానికి నిత్యం భక్తులు వెళ్తుంటారు. బ్రిడ్జి నిర్మాణం జరగక వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

సమస్యల స్థాయి పెంపు..

పంచాయతీ నుంచి నగర పంచాయతీ స్థాయికి పెరిగిన చింతలపూడికి పేరుకే పట్టణ హోదా. సౌకర్యాల కల్పనలో మారుమూల గ్రామకంటే అధ్వానం. మౌలిక సదుపాయాలు లేవు.. అడుగుదామంటే పాలకవర్గ ఎన్నికలే లేవు. ఇళ్ల పన్ను, చెత్త పన్ను బాదేస్తున్నారు. తాగు నీరు లేదు, డ్రెయినేజీ సౌకర్యం లేదు. పట్టణంలో వీధి దీపాలు కూడా వెలగవు. ఎటు చూసినా ఆరు కిలోమీటర్ల పరిధిలోని పట్టణంలో సరైన రోడ్డు లేదు. పట్టణంలో 20 వార్డులు, 35 వేలకు పైగా జనాభా ఉన్నారు. అధిక శాతం దళితవాడలు ఉన్నా నిధుల శాపమో.. నాయకుల నిర్లక్ష్యమో అభివృద్ధి మాత్రం శూన్యం.

ధరల స్థిరీకరణ ఏదీ?

అధికారంలోకి వస్తే ఏటా బడ్జెట్‌లో 3వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటుచేసి రైతును రాజును చేస్తానని చెప్పిన వైసీపీ ప్రభుత్వం చివరికి నట్టేట ముంచింది. దేశంలోనే పామాయిల్ సాగు రాష్ట్రంలో అధికం కాగా రాష్ట్రంలో ఏలూరు జిల్లాలో ఎక్కువ విస్తీర్ణంలో పామాయిల్ సాగవుతోంది. పామాయిల్ ధర తెలంగాణ కన్నా ఎక్కువ అందిస్తానని గత ఎన్నికల ముందు జగన్మోహన్ రెడ్డి హామీ ఇచ్చారు. గతేడాది అత్యధిక ధర రూ.23 వేలు పలికిన పామాయిల్ ధర ప్రస్తుతం రూ.11 వేలకు పడిపోయింది. విదేశాల నుంచి ఆయిల్ దిగుమతి ఎక్కువ అవడంతో పామాయిల్ ధరలు పడిపోతున్నాయి. ధరల స్థిరీకరణ నిధితో ఆదుకుంటానన్న ప్రభుత్వం పామాయిల్ రైతుల ఊసు ఎత్తడంలేదు.

బస్సు డిపో ఏర్పాటు కల..

జిల్లాలోనే పెద్ద నియోజకవర్గమైన చింతలపూడి తెలంగాణ రాష్ట్ర సరిహద్దులో ఉంది. నియోజకవర్గ కేంద్రంలో బస్సు డిపో ఏర్పాటు చేయాలని ఈ ప్రాంత ప్రజలు 1975 నుంచి డిమాండ్ చేస్తున్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా కలగానే మిగిలింది. 1990లో వామపక్ష పార్టీలు డిపో ఏర్పాటు చేయాలని 40 రోజులపాటు రిలే దీక్షలు నిర్వహించారు. గతంలో ఉన్న బస్సు సర్వీసులను రద్దు చేశారు. ఎమ్మెల్యే ఎలీజా రవాణా మంత్రి దృష్టికి రాజధాని విజయవాడకు ఒక్క బస్సు అయినా ఏర్పాటు చేయండని చెప్పినా ఉపయోగం కలుగలేదు. ఈ సమస్య ఈ ప్రాంత ప్రజలకు కలగానే మిగిలింది.

నెరవేరని హామీలు..

చింతలపూడి పట్టణంలో ప్రతిపక్ష హోదాలో వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలో హామీలు గుప్పించారు. తమ ప్రభుత్వం వస్తే చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తిచేసి రైతులకు న్యాయం చేస్తామన్నారు. నిర్వాసిత రైతులు ఆయనను కలిసినా పరిష్కారం కాలేదు. ఆయిల్‌పాం రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తామని, లేదంటే నిధులు కేటాయించి ఎంఐపీ ద్వారా న్యాయం చేస్తామని ఇచ్చిన హామీ నెరవేరలేదు. సీతానగరం-బోయగూడెం రోడ్డు హామీ కూడా నెరవేరలేదు. వంద పడకల ఆసుపత్రి నిర్మాణం హామీ నెరవేరలేదు.

వెలగని వీధి దీపాలు

2005లో చింతలపూడి మెయిన్ రోడ్డు విస్తరించి నాలుగు లైన్ల రోడ్డుగా అభివృద్ధి చేశారు. 2008లో రూ. కోటితో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. ఇవి ప్రారంభించిన రోజు మాత్రమే వెలిగాయి. తరువాత మరమ్మతుల పేరిట నిధులు వెచ్చించారు తప్ప ఏ రోజునా వీధి దీపం వెలిగితే ఒట్టు. ఐదేళ్లలో విద్యుత్ వెలుగుల ఊసే లేదు. రాత్రివేళ పట్టణ ప్రజలు బస్సు దిగి చీకటిలో ఇంటికి వెళ్లాల్సిందే. నగర పంచాయతీ అయినా కనీసం వీధి దీపానికి కూడా నోచుకోలేదని పట్టణ ప్రజలకు నిరాశే మిగిలింది.

రోడ్డు.. శిలాఫలకంతో సరి..

బోయగూడెం-సీతానగరం రోడ్డు నిర్మాణం 20 ఏళ్లుగా శిలాఫలకాలకే పరిమితమైంది. ఈ మార్గంలో మూడు పంచాయతీలు, 11 శివారు గ్రామాలు, 17 కిలోమీటర్ల రోడ్డు అధ్వానంగా ఉంది. 20 ఏళ్లల్లో నలుగురు ఎమ్మెల్యేలు రోడ్డు వేయలేకపోయారు. 2018లో అప్పటి సీఎం చంద్రబాబు రూ.8 కోట్లు మంజూరు చేస్తూ శిలాఫలకం వేస్తే వైసీపీ ప్రభుత్వంలో దానిని పడగొట్టి ఆనవాలు లేకుండా చేశారు. లింగపాలెం మండలంలో ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు వేయిస్తానని, డ్రెయినేజీలు కట్టిస్తానని వైసీపీ ఎమ్మెల్యే హామీలు ఇచ్చారు. ఏ ఒక్కటీ నెరవేర్చలేదు. గ్రామాల్లో కొత్తబోర్లు వేయించి తాగునీరు అందిస్తామన్న హామీ మరిచిపోయారు. గ్రామాల్లో ఆసన్నగూడెం, బాదరాల, రంగాపురం, కొత్తపల్లి, అన్నపనేనివారిగూడెం, కొణిజర్ల, నరసన్నపాలెం, కలరాయనగూడెం, బోగోలు రోడ్లు రాళ్లు, గోతులతో ప్రమాదకరంగా మారాయి. ఎన్నికల్లో గెలవగానే వీటన్నింటిని పరిష్కరిస్తామన్న ఎమ్మెల్యే హామీ ఇప్పటివరకు అతీగతీ లేదు.

నామినేషన్లకు

ముహూర్తాలివే..



నామినేషన్ ప్రక్రియతో ఎన్నికల సంరంభం ఊపందుకుంది. ప్రధాన రాజకీయ పార్టీలు తమ అభ్యర్థులను ఎప్పుడో ప్రకటించాయి. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో నామినేషన్ల దాఖలుకు అభ్యర్థులు ముహూర్తం చూసుకున్నారు. తొలిరోజునే కొందరు నామినేషన్ దాఖలు చేయగా మరికొందరు మంచి ముహూర్తం కోసం వేచి ఉన్నారు. అభ్యర్థులు పురోహితులు, పంచాంగకర్తలు, సిద్ధాంతిలను సంప్రదిస్తున్నారు. పేరు బలం, తారాబలం, నక్షత్ర బలం ప్రకారం తమకు ఏది మంచి ముహూర్తాల్లో తెలుసుకుని వారు నామినేషన్ పత్రాలను దాఖలు చేయటానికి సిద్ధం అవుతున్నారు. గురువారం దశమి మంచిది కావడంతో ఏలూరు జిల్లాలో అసెంబ్లీకి ఆరు, పార్లమెంట్‌కు ఒక నామినేషన్ కూడా దాఖలయ్యాయి. మిగిలిన రోజుల్లో మంచి ముహూర్తాలను ఎంచుకునే పనిలో అభ్యర్థులు నిమగ్నమయ్యారు. రాబోయే రోజుల్లో ఉన్న మంచి ముహూర్తాలతో తమకు అనువుగా ఉన్న రోజులను చూసుకుని అభ్యర్థులు తమ నామినేషన్లను దాఖలు చేసే అవకాశాలున్నాయి.

5 రోజులు మంచి ముహూర్తాలు

కాశీభొట్ల పార్వతీశ్వర శర్మ, పంచాంగ కర్త

నామినేషన్లు దాఖలు చేయడానికి ఈసారి 7 రోజులు సమయం ఉండగా మంచి రోజులు 6 ఉన్నాయి. గురువారం దశమి కావడంతో పలువురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. మిగిలిన రోజుల్లో 19, 22, 23, 24, 25 తేదీలలో మంచి ముహూర్తాలు ఉన్నాయి. అభ్యర్థులు తమ పేరు బలం, తారాబలం, నక్షత్ర బలం ఆధారంగా ముహూర్తాలు చూసుకోవాల్సి ఉంది. శుక్రవారం ఏకాదశి పర్వదినం. ఈనెల 22న సోమవారం హస్తా నక్షత్రం, ఈనెల 23 మంగళవారం పూర్ణిమ, చిత్త నక్షత్రం. ఈనెల 24న బుధవారం స్వాతి నక్షత్రం, ఈనెల 25న నామినేషన్లు చివరి తేదీ గురువారం విదియ, విశాఖ నక్షత్రం ఉండటంతో అవి మంచి ముహూర్తాలుగా పేర్కొనవచ్చు.

- ఏలూరు సిటీ

నవతరం ఓటర్

ఉద్యోగావకాశాలు కల్పించే వారికే ఓటు



యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించే వారికే ఓటు వేయాలని నిర్ణయించుకున్నా. తొలిసారి ఓటు పొందినందుకు ఎప్పుడెప్పుడు ఓటు వేయాలా అని ఉంది. పరిపాలకులను ఎన్నుకునే స్వేచ్ఛ ప్రజాస్వామ్యం మాకు కల్పిస్తోంది. ప్రభుత్వం నుంచి ఉన్నత విద్య సౌకర్యాలు, మెరుగైన కెరియర్ ఆశిస్తున్నాం. యువతకు మేలు చేసేవారికే మా ఓటు.

- పి.కావ్య, హనుమంతులగూడెం, నూజివీడు మండలం

యువ నాయకత్వం కావాలి



నా ఓటు నోటుకు అమ్ముకోను. మెరుగైన పాలన కావాలంటే ఓటు ద్వారానే సాధ్యం రాష్ట్రం పురోగతి సాధించాలంటే యువ నాయకత్వం కావాలి. అవినీతి రూపుమాపే నాయకుడికే నా తొలి ఓటు వేస్తాను. యువత మేల్కొనే సమయం వచ్చింది. ప్రధానంగా విద్య, యువతకు ఉద్యోగాలపై ప్రభుత్వం దృష్టి సారించాలి. రాష్ట్రాన్ని అభివృద్ధి దిశలో నడిపించే సత్తా ఉన్న నాయకుడికే ఓటు వేస్తున్నా. మొదటిసారి నాకు ఓటర్ గుర్తింపు కార్డు వచ్చింది.

- శశి వెంకట్, శనివారపు పేట, ఏలూరు

చదువుకు తగిన ఉద్యోగం కల్పించాలి



యువతకు చదువుకు తగ్గ ఉద్యోగం, ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించాలి. ప్రధానంగా గ్రామీణ యువతకు ఉన్నత విద్య మరింత చేరువ కావాలి. చదువుకున్న విద్యార్థులకు మంచి ఉద్యోగాలు వచ్చి స్థిరపడినప్పుడే అభివృద్ధి సాధ్యం. అలాంటి ప్రభుత్వానికి మా మద్దతు ఉంటుంది.

- మానేపల్లి సూరజ్, ఆగిరిపల్లి

సీనియర్ ఓటర్

నా ఓటు వారికే..



70వ దశకం నుంచి ఎన్నికల్లో ఓటే వేస్తున్నా. నాడు ప్రజలకు సమస్యల పరిష్కారానికి కృషి చేసిన, ప్రజలకు అండగా నిలిచిన నాయకుని వెంటే ప్రజా బాహుళ్యం ఉండేది. నాటికి నేటికి ఎన్నికల చిత్రంలో ధనప్రవాహం పెరిగింది. అయినా పాతతరం ఓటర్లు ఎక్కువ భాగం ప్రజా సమస్యలపై పోరాడేవారికి అండగా నిలుస్తాం. అలాంటి వారికే ఓటే వేస్తా.

- అత్తి వెంకటేశ్వరరావు, బత్తులవారిగూడెం నూజివీడు మండలం

ఉచిత పథకాలు ఎవరడిగారు..



అనవసరమైన ఉచిత పథకాలు ప్రజలపై రుద్దుతున్నారు. ఎవరడిగారు.. ఉచితంగా ఇవ్వాల్సినవి ఏమిటి? ప్రభుత్వం అప్పులపాలై ఆ అప్పులు తీర్చేందుకు తిరిగి పన్నులను పెంచుతూ ప్రజలపై మోయలేని భారం మోపడం ప్రభుత్వాలకు తగదు. ప్రజలకు, ప్రభుత్వానికి భారం కాకుండా సంక్షేమం అమలు చేయాలి. ప్రజలను తామే ఉద్ధరిస్తున్నామని చెప్పుకునే వారికి మద్దతు ఇవ్వను.

- మడుపల్లి సుజాత, ఆగిరిపల్లి

భవిష్యత్‌కు భరోసా ఇవ్వాలి



భవిష్యత్‌కు భరోసా కల్పిస్తూ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే నాయకుడికే ప్రాధాన్యం ఇస్తా. నేతల ఎన్నికల హామీలు కార్యరూపం దాల్చడం లేదు. ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు లొంగొద్దు. రాష్ట్రాన్ని అభివృద్ధి దిశలో నడిపించాలంటే ఆ దిశగా ప్రజలు ఆలోచించి భవిష్యత్‌కు ప్రాధాన్యం ఇచ్చేవారికి ఓటు వేయాలి.

- సీహెచ్.చంద్రరావు, ఏలూరు

ఆయ్.. అలాగేనండి..!



ఆ నేతల తీరే వేరు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

ఉండి నియోజకవర్గంలో కీలక నాయకుల వ్యవహారం అభ్యర్థులకు అంతుచిక్కడం లేదు. ఏ పార్టీ అభ్యర్థి వెళ్లినా అయ్.. అలాగేనండి అంటున్నారు, మీకే మద్దతు అంటూ చెవిలో చెబుతున్నారు. కానీ ఇంటి గడప దాటరు. అభ్యర్థులను సాదరంగా ఆహ్వానిస్తున్నారు. తిరిగి ఊరి పొలిమేర వరకు సాగనంపుతున్నారు. అటువంటి నాయకులు అంతా తమ వెంటే ఉన్నారంటూ అభ్యర్థులు సంబర పడిపోతున్నారు. ఇప్పటివరకు ఉండిలో తెలుగుదేశం తరఫున రామరాజు ప్రచారం చేశారు. స్వతంత్ర అభ్యర్థిగా శివరామరాజు, వైసీపీ అభ్యర్థిగా పీవీఎల్ నరసింహరాజు గ్రామాల్లో పర్యటించారు. అందరినీ ఆ నాయకులు తమ ఇంటి వద్ద ఆదరించారు. ఎన్నికల్లో మద్దతు ఇస్తామంటూ చిరునవ్వులు చిందిస్తున్నారు. మరోవైపు కూటమి అభ్యర్థి రఘురామకృష్ణంరాజు అవుతారంటూ ప్రచారం జరగడంతో ఆయనకు కూడా తమ మద్దతు ఉంటుందని సంకేతాలు పంపుతున్నారు. ఇటువంటి నాయకులు ఇప్పుడు తెలుగుదేశం, వైసీపీలో కూడా ఉన్నారు. రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో పార్టీ పదవులు అనుభవించారు. ఇప్పటికీ పార్టీ పదవుల్లో ఉన్నారు. నామినేటెడ్ పోస్టులను అనుభవిస్తున్నారు. అటువంటి నాయకులపై ఇప్పుడు నియోజకవర్గంలో చర్చ జరుగుతోంది. గతంలో మాదిరిగా ఎన్నికల ప్రచారంలో బయటకు రావడం లేదు. తాము ఏ పార్టీకి మద్దతు ఇస్తామనేది స్పష్టంగా చెప్పడంలేదు. అంతా స్తబ్దుగా ఉన్నారు. వారివద్దకు వచ్చే అభ్యర్థులందరికీ మర్యాద ఇస్తున్నారు.

ఓటరు మాట

నీరిస్తే.. ఓటేస్తాం!


నాయకులకు మంచినీటి సమస్య వివరిస్తున్న మహిళలు

తాగునీటిపై పుట్లచెరువు మహిళల మొర..

ఎన్నికలు వచ్చాయి.. నాయకులు ప్రత్యక్షమవుతున్నారు. తాగేందుకు గుక్కెడు నీళ్ల ఇవ్వండి.. చాలు ఓటేస్తాం అంటున్నారు పుట్లచెరువు మహిళలు. అంటూ ఆనాడు వైసీపీ నేతలు మొరపెట్టుకున్నాం. ఇచ్చిన హామీ మేరకు ఓట్లు వేశాం. తర్వాత మాకు ఇచ్చిన హామి నీటి మూటగానే మిగిలింది. మంచినీటి మాటే పట్టించుకున్న నాథుడే కరువయ్యాడు. మళ్లీ ఎన్నికలు వచ్చేశాయి సమస్య అలాగే ఉంది. ఈ సారైన మాకు మంచినీళ్లు ఇవ్వండి... మా ఓట్లు మీకే వేస్తాం అంటూ గురువారం పుట్లచెరువులో ఎన్నికల ప్రచారం చేస్తున్న టీడీపీ, జనసే, బీజేపీ నాయకుల వద్ద తమ మొరపెట్టుకున్నారు. గత ఎన్నికల్లో వైసీపీ మాటలు నమ్మి మోసపోయామని అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో టీడీపీ, జనసేన, బీజేపీ సమక్షంలోనే కైకలూరు కూటమి అభ్యర్థి కామినేని శ్రీనివాస్‌కు ఫోన్‌లో పరిస్థితిని వివరించారు. మంచినీటి పరిష్కరించేందుకు తన శాయశక్తుల కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం గ్రామంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

- మండవల్లి

భయం లేకుండా ఓటేయండి

స్వేచ్ఛగా ఓటు వేసేందుకు పోలీసు, సాయుధ బలగాలు ఓటర్లకు అండగా ఉన్నారు. లింగపాలెం మండలం యడవల్లి, అన్నపనేనివారిగూడెం గ్రామాల్లో సాయుధ దళాలతో గురువారం కవాతు నిర్వహించారు. చింతలపూడి సీఐ ఎం.సుధాకర్ మాట్లాడుతూ ఎన్నికల్లో భయం లేకుండా ఓటేయడానికి రక్షణగా ఉంటామన్నారు. అందరూ నిబంధనలు పాటించాలని సూచించారు. ఓటుహక్కును ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని అన్నారు. ఎటువంటి గొడవలు లేకుండా ఎన్నికల ప్రక్రియను కొనసాగించాలని కోరారు. ధర్మాజీగూడెం ఎస్సై పి.చెన్నారావు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

- లింగపాలెం


సాయుధ దళాల కవాతు

ముసుగు ఎగిరిపోయింది..



ఉండి, ఏప్రిల్ 18: ఎన్నికల కోడ్‌లో భాగంగా అధికారులు రాజకీయ నేతల విగ్రహాలకు, శిలాఫలకాలకు ముసుగులు వేశారు. అయితే ఇంకా ఎన్నికలు ముగియకుండానే కొన్నిచోట్ల ముసుగులు తొలగిపోతున్నాయి. ఉండి ప్రధాన సెంటర్ పంట కాలువను చేరుకుని వున్న ప్రాంతంలో దివంగత సీఎం రాజశేఖర్‌రెడ్డి ఆవిష్కరించిన శిలాఫలకం కనిపించకుండా కట్టిన క్లాత్ ఊడిపోయింది. దీని పక్క నుంచే తరుచూ అధికారులు వెళ్తున్నా దీన్ని గమనించడం లేదు.

సెంటిమెంట్



ఎన్నికల్లో ఎవరూ నిలబడినా..

గొంది నుంచే ప్రచారం

నరసాపురం నియోజకవర్గానికి ఈశాన్యంలో ఉన్న గ్రామం గొంది, యలమంచిలి మండలానికి ఆనుకుని ఉన్న ఈ గ్రామం మైనర్ పంచాయితీ, అయితే ప్రతి పార్టీకి ఈ గ్రామం సెంటిమెంట్, పార్టీలకు సంబంధించి ఏ కార్యక్రమాలైనా ప్రారంభించాలన్న ముందుగా ఇక్కడ నుంచి ప్రారంభిస్తారు, ఈ సెంటిమెంట్ ఎన్నికల ప్రచారంలో కూడా కొనసాగిస్తారు, సీటు ప్రకటించగానే ముందుగా ఈ గ్రామంలోకి వినాయక గుడిలో పూజలు చేస్తారు ఆ తరువాత మాజీ సర్పంచ్ నాగేంద్ర ఇంటికి వెళ్లతారు.ఆక్కడ అల్పాహారం చేసిన తరువాత ప్రచారాన్ని మొదలుపెడతారు. ఇది ప్రతి ఎన్నికల్లోనూ జరిగే సెంటిమెంట్, దీంతో ఆ గ్రామస్థులు కూడా పార్టీలను పక్కన పెట్టి వచ్చిన ప్రతి నాయకులు వెంట ప్రచారం మొదలుపెట్టే వరకు ఉంటారు. గ్రామస్థులు కూడా ఎన్నికల వరకే పార్టీలతో రాజకీయం చేస్తారు. ఆ తరువాత అంతా ఒక్కతాటిపై ఉంటారు. గెలిచిన తరువాత ఏ నాయకుడు గ్రామానికి వచ్చిన అంతా సాధారంగా ఆహ్వానిస్తారు.

-నరసాపురం రూరల్

నందమూరు వెంకన్న గుడిలో పూజలు చేసి..



తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో ఎవరు ఎన్నికల ప్రచారం ప్రారంభించినా మండలంలో ఓ మూలన ఉండే ఆ గ్రామం నుంచే ప్రారంభించడం ఆనవాయితీ. అదే తాడేపల్లిగూడెం మండలం నందమూరు గ్రామం. ఈ గ్రామం నియోజకవర్గానికి ఈశాన్యంలో ఉండటం కారణంగా ఇక్కడి ప్రచారం ప్రారంభించడం సెంటిమెంట్‌గా మారింది. ఈ గ్రామంలో పురాతన వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి ఇక్కడి ప్రజల ఆశీర్వచనాలు తీసుకుని ప్రచారంలో ముందుకు వెళతారు.

-తాడేపల్లిగూడెం రూరల్

హ్యాట్రిక్

నరసాపురం నుంచి హ్యాట్రిక్ ఎమ్మెల్యే !



నియోజకవర్గ చరిత్రలో మూడు సార్లు ఎన్నికై హ్యాట్రిక్ సృష్టించిన ఘనత మాజీ మంత్రి కొత్తపల్లికే దక్కింది. టీడీపీ అభ్యర్థిగా 1989, 1994, 1999 ఎన్నికల్లో వరుసగా విజయం సాధించి హ్యాట్రిక్ సృష్టించారు. ఈ రికార్డుతో పాటు అత్యధిక కాలం ఎమ్మెల్యేగా పని చేసిన ఘనత కొత్తపల్లికే దక్కింది. 1989 నుంచి 2009 వరకు సుమారు 30 ఏళ్లు ఎమ్మెల్యేగా పనిచేశారు. - నరసాపురం

ఇదీ సంగతి

ఆ..ముగ్గురూ దేవదాయశాఖ మంత్రులే..

రాష్ట్ర రాజకీయాల్లో తాడేపల్లిగూడెం నియోజకవర్గానిది ప్రత్యేకస్థానం.ఇప్పటి వరకూ 18 సార్లు ఎన్నికలు జరిగితే ముగ్గురు మంత్రులుగా నిలిచారు. ఈలి ఆంజనేయులు, పైడికొండల మాణిక్యాలరావు, కొట్టు సత్యనారాయణ మంత్రులుగా చేశారు. ఈ ముగ్గురు మంత్రులకు కూడా దేవదాయశాఖ కేటాయించడం విశేషం. దీంతో తాడేపల్లి గూడెం ఎప్పుడు మంత్రివర్గ విస్తరణలో చర్చ వచ్చినా దేవదాయశాఖ కన్ఫమ్ అనే చర్చలు జోరుగా సాగుతుంటాయి. మరోవైపు ఇదే జిల్లాకు చెందిన దండు శివరామరాజు కూడా దేవదాయ శాఖ మంత్రిగా పనిచేశారు. - తాడేపల్లిగూడెం రూరల్

నరసాపురం నియోజకవర్గానికి రాష్ట్రంలోనే ప్రత్యేకత ఉంది. ఆసెంబ్లీ, పార్లమెంట్ రెండు ఈ నియోజకవర్గం పేరునే ఉన్నాయి. జిల్లాకు శివారునున్న ఈ నియోజకవర్గ పరిధిలో యలమంచిలి మండలంలో చాలా గ్రామాలు ఉండేవి. అప్పట్లో కొప్పర్రు, మల్లవరం, మల్లవరం లంకతో పాటు భీమవరం మండలంలోని వెంప, శ్రీరాంపురం కూడా ఈ నియోజకవర్గ పరిధిలోనే ఉండేవి. ప్రస్తుతం ఈ నియోజకవర్గంలో నరసాపురం పట్టణం, మండలం, మొగల్తూరు మండలాలు మాత్రమే ఉన్నాయి. జిల్లాలోనే కాకుండా రాష్ట్రంలోనే అతి చిన్న నియోజకవర్గం ఇదే. ప్రస్తుతం 1,68,187 మంది ఓటర్లు ఉన్నారు.

- నరసాపురం

ఫ్లాష్ బ్యాక్



మంత్రుల ఖిల్లా

నియోజకవర్గం : నరసాపురం

మండలాలు : నరసాపురం, మొగల్తూరు, నరసాపురం రూరల్
మొత్తం ఓటర్లు : 1,68,187
పురుషులు : 83,745,
మహిళలు : 84,422

రాష్ట్రంలోనే ప్రత్యేకత
1983 నుంచి టీడీపీకి కంచుకోట
జిల్లాలో అతి చిన్న నియోజకవర్గం

ఉమ్మడి పశ్చిమలో ఈ నియోజకవర్గం ఒకప్పుడు కమ్యూనిస్టుల ప్రాభల్యం ఎక్కువుగా ఉండేది . టీడీపీ ఆవిర్భావానికి ముందువరకు ఇక్కడ ప్రధాన ప్రతిపక్షం కమ్యూనిస్టులే. 1952లో సీపీఎం బలపర్చిన శ్యాంసుందరం, 1967లో ఆర్ఎస్ రాజు ఎమ్మెల్యేలుగా గెలుపొందారు.



1983లో టీడీపీ ఆవిర్భావం తరువాత ఈ నియోజకవర్గం ఆ పార్టీకి కంచుకోటగా ఉంటూ వచ్చింది. 2009 వరకు అంటే 26 ఏళ్లు ఆ పార్టీకి అపజయం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీకి వ్యతిరేక పవనాలు వీస్తున్నప్పటికీ ఇక్కడ మాత్రం ఆ ప్రభావం కనిపించలేదు. ఈ నియోజకవర్గంలో తొలిసారి టీడీపీ ఎమ్మెల్యేగా గెలుపొందిన ఘనత హరిరామజోగయ్యకే దక్కింది. 1983లో గెలిచి ఆయన ఎన్టీఆర్ మంత్రి వర్గంలో హోంమంత్రిగా పనిచేశారు. 1986లో కూడా పోటీ చేసి విజయం సాధించి రెండోసారి మంత్రి అయ్యారు. ఇక ఆ తరువాత 1989 నుంచి 2009 వరకు మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు నాలుగు సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. చంద్రబాబు, ఎన్టీఆర్ కేబినెట్‌లో గృహనిర్మాణ, విద్యుత్‌శాఖ మంత్రులుగా పని చేశారు. 2009లో ఆయన ప్రజారాజ్యం కండువా కప్పుకోవడంతో తొలిసారి ఈ నియోజకవర్గం టీడీపీ ఓటమి చెందింది.తరువాత ఆయన కాంగ్రెస్‌లో చేరి 2012 ఉప ఎన్నికల్లో ముదునూరిపై విజయం సాధించారు. తిరిగి 2014లో కాంగ్రెస్‌కి రాజీ నామా చేసి వైసీపీ కండువా కప్పుకున్నారు. ఆ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి బండారు మాధవనాయుడు 21,712 ఓట్లతో విజయం సాధించగా కొత్తపల్లి ఓడిపోయారు. అయితే కొత్తపల్లి ఎక్కువ కాలం వైసీపీలో ఇమడలేదు. 2015లో రాజీనామా చేసి టీడీపీలో చేరారు. ఆయనకు 2019 ఎన్నికల్లో టిక్కెట్ ఇవ్వలేదు. దీంతో మళ్లీ వైసీపీ కండువా కప్పుకున్నారు. అయితే అక్కడా టిక్కెట్ లభించలేదు. ఆ ఎన్నికల్లో ముదునూరి విజయానికి కృషి చేశారు. త్రిముఖ పోటీల్లో ముదునూరి జనసేన అభ్యర్థి నాయకర్‌పై 6,400 ఓట్లతో విజయం సాధించారు.

కాంగ్రెస్ ఏడుసార్లు గెలుపు

ఇక్కడ కాంగ్రెస్‌ను కూడా ప్రజలు ఆదరించారు. ఈ నియోజకవర్గంలో ఆ పార్టీ అభ్యర్థులు ఏడుసార్లు విజయం సాధించారు. 1956లో ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థిగా రెడ్డి వెంకటరెడ్డినాయడు గెలుపొంది ఉమ్మడి మద్రాసులో న్యాయ శాఖ మంత్రిగా పనిచేశారు. నియోజకవర్గ చరిత్రలో తొలి మంత్రి చేసిన ఘనత ఈయనకే దక్కింది. ఆ తరువాత పరకాల శేషావతారం రెండు సార్లు మంత్రి అయ్యారు. 1960, 1962, 1972, 1976 ఎన్నికల్లో పరకాల శేషావతారం విజయం సాధించారు. పీవీ నర్సింహారావు, కోట్ల విజయభాస్కర్‌రెడ్డి కేబినెట్‌లో ఆయన మునిసిపల్, రవాణశాఖ మంత్రిగా పనిచేశారు. 1981లో ఆయన ఆకాల మరణంతో ఆయన సతీమణి పరకాల కాళికాంబ ఉప ఎన్నికల్లో పోటీ చేసి అతి తక్కువ 873 ఓట్లతో విజయం సాధించారు. తొలి మహిళా ఎమ్మెల్యే కూడా కాళికాంబే.

మూడు సార్లు ఉప ఎన్నికలు

నరసాపురం నియోజకవర్గ చరిత్రలో ఇప్పటివరకు మూడు సార్లు ఉప ఎన్నికలు జరిగాయి. 1955లో నియోజకవర్గం ఏర్పడిన తరువాత తొలి ఉప ఎన్నిక 1982లో జరిగింది. అప్పటి వరకు మంత్రిగా ఉన్న పరకాల శేషావతారం ఆకస్మికంగా మృతి చెందారు. దీంతో జరిగిన ఉప ఎన్నికలో ఆయన సతీమణి కాళికాంబ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. జనతాదల్ అభ్యర్థి నాగేశ్వరరావు మీద 800 ఓట్లతో గెలిచారు. ఆ తరువాత ఉప ఎన్నిక 1996లో జరిగింది అప్పటి వరకు మంత్రిగా ఉన్న కొత్తపల్లి సుబ్బారాయుడు పదవికి రాజీనామా చేసి ఎంపీ అభ్యర్థిగా బరిలో నిలిచారు. దీంతో ఆయన సోదరుడు జానకీరామ్ టీడీపీ అభ్యర్థిగా పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి పరకాల ప్రభాకర్‌పై జానకీరామ్ 5500 ఓట్లతో విజయం సాధించారు. మూడోసారి ఎన్నిక 2012లో వచ్చింది. 2009లో కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన ముదునూరి ప్రసాద రాజు వైసీపీలో చేరి జగన్‌కు మద్దతుగా నిలవడంతో విప్ ధిక్కరించారనే కారణంతో పార్టీ అనర్హత వేటు వేసింది. దీంతో జరిగిన ఉప ఎన్నికల్లో ఆయన వైసీపీ తరఫున బరిలో నిలిచారు. కాంగ్రెస్ అభ్యర్థిగా కొత్తపల్లి సుబ్బారాయుడు సుమారు 3200 ఓట్లతో విజయం సాధించారు.

సంవత్సరం	గెలిచిన అభ్యర్థి	పార్టీ	ప్రత్యర్థి	పార్టీ	మెజార్టీ
1952	పి.శ్యాంసుందర్	సీపీఐ	వెంకన్న	కెఎంపీపీ	61,241
1955	జి.వెంకటరెడ్డినాయుడు	కాంగ్రెస్	ఎస్.రామారావు	సీపీఎం	8,535
1962	పరకాల శేషావతారం	కాంగ్రెస్	ఆర్ఎస్ రాజు	సీపీఐ	3,794
1967	బీఆర్ఎస్ రాజు	సీపీఎం	శేషావతారం	కాంగ్రెస్	4,305
1972	పరకాల శేషావతారం	కాంగ్రెస్	ఆర్ఎస్ రాజు	సీపీఎం	18,700
1978	పరకాల శేషావతరం	కాంగ్రెస్	పి.వాసుదేవరావు	జనత	11,834
1983	హరిరామజోగయ్య	టీడీపీ	కాళికాంబ	కాంగ్రెస్	23,653
1986	హరిరామజోగయ్య	టీడీపీ	ఎం.సూర్యనారాయణ	కాంగ్రెస్	33,047
1989	కొత్తపల్లి సుబ్బారాయుడు	టీడీపీ	పి.వాసుదేవరావు	కాంగ్రెస్	13,201
1994	కొత్తపల్లి సుబ్బారాయుడు	టీడీపీ	పరకాల ప్రభాకర్	కాంగ్రెస్	15,477
1999	కొత్తపల్లి సుబ్బారాయుడు	టీడీపీ	తులసీ	కాంగ్రెస్	34,729
2004	కొత్తపల్లి సుబ్బారాయుడు	టీడీపీ	ముదునూరి	కాంగ్రెస్	3,518
2009	ముదునూరి ప్రసాదరాజు	కాంగ్రెస్	కొత్తపల్లి సుబ్బారాయుడు	ప్రజారాజ్యం	17,325
2014	బండారు మాధవనాయుడు	టీడీపీ	కొత్తపల్లి సుబ్బారాయుడు	వైసీపీ	21,712
2019	ముదునూరి ప్రసాదరాజు	వైసీపీ	బొమ్మిడి నాయకర్	జనసేన	6,436

తొలి మంత్రి గ్రంధి వెంకటరెడ్డి నాయుడు

ఉమ్మడి పశ్చిమ గోదావరిలో నరసాపురం నియోజకవర్గానికి రాజకీయంగా ఒక ప్రత్యేక గుర్తింపు ఉంది. మరే నియోజకవర్గంలో లేని విధంగా ఇక్కడ గెలుపొందిన అభ్యర్థులు కేబినేట్ పదవుల్ని దక్కించుకున్నారు. వారిలో తొలి మంత్రి అయిన ఘనత గ్రంధి వెంకటరెడ్డినాయుడుకే దక్కింది. ఉమ్మడి మద్రాసులో ఉన్నప్పుడు 1955 జరిగిన ఎన్నికల్లో ఆయన కాంగ్రెస్ అభ్యర్థిగా గెలిచి న్యాయశాఖ మంత్రిగా పని చేశారు. ఆ తరువాత 67లో, 78లో గెలిపొందిన పరకాల శేషావతారం ఉమ్మడి రాష్ట్రంలో పురపాలక, దేవదాయశాఖ మంత్రిగా పని చేశారు. టీడీపీ ఆవిర్భావం తరువాత ఈ నియోజకవర్గం నుంచి 1983లో గెలుపొందిన హరిరామజోగయ్య ఎన్టీఆర్ కేబినేట్‌లో హోంశాఖ నిర్వహించారు. ఆ తరువాత అదృష్టం కొత్తపల్లిని వరించింది. 1994లో గెలుపొందిన కొత్తపల్లి ఎన్టీఆర్ కేబినేట్ గృహ నిర్మాణ మంత్రిగా, ఆ తరువాత 1999ఎన్నికలో గెలిచి చంద్రబాబు కేబినేట్‌లో విద్యుత్ మంత్రిగా పని చేశారు.

నాటి నృసింహపురమే.. నేటి నరసాపురం

వశిష్ఠ గోదావరి తీరంలో సాగర సంగమ స్థలానికి సమీపంలో అవతరించిన నరసాపురం జిల్లాలో చారిత్రక ప్రాముఖ్యత కలిగిన ప్రదేశాల్లో ఒక్కటి. త్రేతాయుగంలో శ్రీరామచంద్రుడు సీతాదేవి, లక్ష్మణుడితో వశిష్ఠ గోదావరి తీరంలో సంచరించినట్లు పురాణాలు చెపుతున్నాయి. నృసింహపురాణం ఆధారంగా నరసాపురాన్ని గతంలో నృసింహపురం, నవరసపురం వంటి పేర్లతో వ్యవహరించినట్లు తెలుస్తోంది. అంతర్వేది నరసింహస్వామి దేవాలయం నరసాపురానికి సమీపంలో ఉంది. ఆ స్వామి పేరును బట్టి నరసింహపురంగా ఏర్పడి కాలక్రమంలో నరసాపురంగా మారిందని ఒక కథనం ఉంది. ముస్లిం గ్రంథాలు బట్టి నరసాపురం నేషాపురంగా ఉండేదని కాలక్రమంలో నరసాపురంగా మారిందని మరో కథనం ఉంది. ప్రముఖ మధన గోపాలస్వామి దేవాలయం ప్రాచీనతను బట్టి క్రీస్తు శకం 1173 నాటికే నరసాపురం ఒక స్థిరరూపం దాల్చిందని తెలియవచ్చింది.


మంత్రి కారుమూరి వల్లే రాజీనామా : చిట్టూరి సునంద



ఇరగవరం, ఏప్రిల్ 18 : వైసీపీపై ప్రజల్లోనే కాకుండా ఆ పార్టీ నాయకుల్లోనూ అసంతృప్తి పెరుగుతోంది. తణుకు మండలం వేల్పూరు గ్రామానికి చెందిన మాజీ ఏఎంసీ చైర్మన్, వైసీపీ సీనియర్ నాయకురాలు చిట్టూరి సునంద ఆ పార్టీకి రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నారు. గురువారం ఆమె గృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మంత్రి కారుమూరి వైఖరి కారణంగానే పార్టీకి రాజీనామా చేస్తున్నానని వెల్లడించారు. కూటమి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణకు తన మద్దతు ఇస్తున్నానని స్పష్టం చేశారు. పార్టీ గెలుపు కోసం అహర్నిశలు శ్రమించిన తనపై లేనిపోని ఆరోపణలు చేసి అధికార పార్టీ కార్యక్రమాలకు మంత్రి తనని దూరం చేశారన్నారు. గత నాలుగు సంవత్సరాలుగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నానని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఐదేళ్లలో అభివృద్ధి లేకపోగా అవినీతి పెరిగిందన్నారు. టిడిఆర్ స్కాం, ఇళ్ళ స్థలాల్లో పేదల వద్ద డబ్బులు దోచుకోవడం వంటి దుర్మార్గమైన పనులు కారుమూరి చేశారని విమర్శించారు. నా వెనుక ఉన్న కార్యకర్తలను కూడా అనేక ఇబ్బందులను గురి చేశారని వారికి వచ్చిన ఇళ్ళ సైతం లాగేసుకున్నారని విమర్శించారు. ఇటు వంటి దుర్మార్గ పాలన వల్లే తణుకు నియోజకవర్గంలో అనేక మంది వైసీపీ నాయకులు కారుమూరికి దూరంగా ఉన్నారన్నారు.

పశ్చిమలో పవన్ కల్యాణ్ పర్యటన

21,22 తేదీల్లో షెడ్యూల్ ఖరారు



భీమవరం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో పర్యటించనున్నారు. ఈ నెల 21, 22 తేదీల్లో నిర్వహించే ఎన్నికల సభల్లో పాల్గొంటారు. 21 వతేదీన భీమవరం, నరసాపురంలో, 22న తాడేపల్లిగూడెం, ఉంగుటూరు సభల్లో పాల్గొంటారు. పోలవరం నియోజక వర్గంలో 30వ తేదీన పర్యటిస్తారని పార్టీ వర్గాలు చెపుతున్నాయి. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు ఉమ్మడిగా హాజరవుతారా లేదా జనసేనాని ఒక్కరే పాల్గొంటారా అనేది త్వరలో నిర్ణయం కానుంది. ఉమ్మడి పశ్చిమలో 21, 22 తేదీల్లో పవన్ కల్యాణ్ పర్యటన కోసం ఆ పార్టీ నాయకులు కసరత్తు చేస్తున్నారు.



విస్తృతంగా తనిఖీలు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 18 : ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ మేరీ ప్రశాంతి అన్నారు.బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం తెల్లజాము వరకూ జిల్లాలోని అన్ని ప్రధాన రహదారులపై తనిఖీలు నిర్వహించారు. గడిచిన 24 గంటల్లో జిల్లా వ్యాప్తంగా చేపట్టిన తనిఖీల్లో రూ4,340 విలువైన 145.6 లీటర్ల మద్యం, ఆరు లక్షల 52 వేలు రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.



లక్ష్మణేశ్వరంలో సగం వైసీపీ ఖాళీ

సుమారు 500 మంది జనసేనలో చేరిక

నరసాపురం రూరల్, ఏప్రిల్ 18: నరసాపురం మండలంలో వైసీపీకి ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీకి కంచుకోటగా ఉంటూ వస్తున్న లక్ష్మణేశ్వరంలో గురువారం సుమారు 500 మంది వైసీపీకి రాజీనామాలు చేశారు. గ్రామానికి చెందిన మల్లిపూడి చిన్నబాబు, వెన్నాముర‌ళీ ఆధ్వర్యంలో వీరింతా జనసేనలో చేరారు. వీరికి మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, బొమ్మిడి నాయకర్, చాగంటి మురళీకృష్ణలు పార్టీ కండువాలు కప్పి జనసేనలోకి ఆహ్వానించారు. పోత్తూరి రామరాజు, వర్ధనపు ప్రసాద్‌లు మాట్లాడుతూ శత్రువును ఐక్యంగా తరిమికొడదామని పిలుపునిచ్చారు. రానున్న రోజుల్లో మరి కొంత మంది కూటమిలో చేరేందుకు రెడీగా ఉన్నారన్నారు. కొప్పాడ రవి, ఆకన చంద్రశేఖర్, తోట శ్రీధర్, వలవల నాని, బందెల రవీంద్ర, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.



ఆచంటలో వారంతా గుడ్‌బై

పెనుమంత్ర, ఏప్రిల్ 18 : పెనుమంత్ర మండలం మార్టేరులో ఒక సామాజిక వర్గానికి చెందిన రైతులు కొందరు వైసీపీకి గుడ్‌బై చెప్పి మాజీ మంత్రి పితాని సత్యనారాయణ సమక్షంలో టీడీపీలో చేరారు. పితాని మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి కొత్తగా ప్రవేశ పెట్టిన భూ సంరక్షణ చట్టం రైతులకు నష్టపరిచేదిగా ఉందని దీంతో రైతులు ప్రభుత్వంపై వ్యతిరేకంగా ఉన్నారన్నారు. వెలగల నాగిరెడ్డి, గుడి మెట్ల వెంకటేశ్వరరెడ్డి, పడాల తిరపారెడ్డి, చిర్ల సురేంద్రరెడ్డి, చిర్ల యేసు, చిర్ల వెంకటరెడ్డి, మల్లిడి రామ కృష్ణారెడ్డి, వెలగల నాగిరెడ్డి, సత్తి సూర్యచంద్రారెడ్డి, గుడిమెట్ల తిరపా రెడ్డి, చింత దుర్గాప్రసాద్ రెడ్డి, కొవ్వూరి బుల్లి రెడ్డి, గుడిమెట్ల సాయి రెడ్డి, బేతిరెడ్డి లీలా కృష్ణారెడ్డి, గుడిమెట్ల సాయి రెడ్డి, చింత హరీష్ కుమార్ రెడ్డి, చిర్ల సూర్యనారాయణ రెడ్డి, కర్రీ నాగ చంద్రశేఖర్ రెడ్డి, గొలుగూరి చంటి రెడ్డి, సూర్రెడ్డి, కోనాల ఆనందీశ్వర్ రెడ్డి, పడాల బుల్లియ్య, కర్రీ రంజిత్ కుమార్ రెడ్డి తదితరులు తెలుగుదేశం పార్టీలో చేరారు.. పండించిన పంట కూడా అమ్ముకోలేని పరిస్థితి ఉందని, రైతు వ్యతిరేక విధానాల కారణంగా టీడీపీలో చేరినట్టు తెలిపారు.

ఆచంటలో ప్రశాంతత లేకుండా చేశారు: పితాని


పితాని సమక్షంలో టీడీపీలో చేరిన ఇలపర్రు వైసీపీ నాయకులు

పెనుగొండ, ఏప్రిల్ 18: ప్రశాంతంగా ఉన్న ఆచంటను అశాంతిగా మార్చిన ప్రజా ప్రతినిధి ఎమ్మెల్యే రంగనాధరాజు అని ఆచంట టీడీపీ కూటమి అభ్యర్థి పితాని సత్యానారాయణ అన్నారు. ఇలపర్రు గ్రామానికి చెందిన వైసీపీ మాజీ సర్పంచ్ వైసీపీకి గుడ్‌బై చెప్పి మాజీ మంత్రి పితాని సమక్షంలో తెలుగుదేశంలో చేరారు. ఇలపర్రు వైసీపీ మాజీ సర్పంచ్ కేతా భీములు ప్రసంగించారు. టీడీపీలో చేరిన వారిలో కట్టా సత్యనారాయణ, కేతా సత్తిరాజు, పెచ్చెట్టి రామ చంద్రరాజు, పెచ్చెట్టి శ్రీను, కేతా శ్రీను, జుత్తిగ దుర్గా తదితరులు ఉన్నారు.

పోడూరు: కవిటం గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు గుడిమెట్ల నరేంద్రరెడ్డి ఆయన అనుచరులు 50మంది గురువారం మాజీమంత్రి పితాని సత్యనారాయణ సమక్షంలో టీడీపీలో చేరారు. పితాని సత్యనారాయణ వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈకార్యక్రమంలో టీడీపీ లీగల్‌సెల్ కన్వీనర్ మేడపాటి గంగాధరరెడ్డి, గ్రామటీడీపీ అధ్యక్షుడు గుబ్బల అప్పన్నస్వామి, కార్యదర్శి ఊడిగ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జగన్ రాక్షస పాలన: తోట


టీడీపీలో చేరిన నాయకులకు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న తోట సీతారామలక్ష్మి

భీమవరం అర్బన్: టీడీపీ నుంచి వైసీపీకి వెళ్లిన వారు జగన్ రాక్షస పాలనతో విసుకు చెంది తిరిగి టీడీపీలోకి వస్తున్నారని పార్టీ జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మీ అన్నారు. భీమవరం పట్టణ అధ్యక్షులు ఇందుకూరి సుబ్రహ్మణ్యం రాజు, సోషల్ మీడియా కోఆర్డినేటర్ మిర్తిపాటి గున్నేశ్వరరావు ఆధ్వర్యంలో వైసీపీ నుంచి 30 మంది యువకులు టీడీపీలో చేరారు. వైసీపీ నాయకుడు బండి రెడ్డి వెంకన్న తన మిత్రబృందంతో టీడీపీలో చేరగా వారికి తోట సీతారామ లక్ష్మి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

వైసీపీ విధానాలతో అన్నివర్గాలకు ఇబ్బంది

తాడేపల్లిగూడెం అర్బన్: వైసీపీ విధానాలతో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి అన్నారు. వైసీపీకి చెందిన వారితో పాటు తటస్థంగా ఉన్న పలువురు గురువారం బాబ్జి సమక్షంలో టీడీపీలో చేరగా బాబ్జి కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. అడ్డాల నరసింహారావు, లింగపల్లి స్వాతి, లింగంపల్లి చిన్న, అమలాపురం వెంకన్న, సాంబశివరావు, బాదంశెట్టి సత్యనారాయణ తదితరులు టీడీపీలో చేరిన వారిలో ఉన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం


జనసేన అభ్యర్థి నాయకర్‌తో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కొత్తపల్లి, బండారు

మొగల్తూరు, ఏప్రిల్ 18: చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని, సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపిస్తేనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, మాజీ ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు పిలుపునిచ్చారు. గురువారం కొత్తపాలెం గ్రామంలో వారు జనసేన అభ్యర్థి బొమ్మిడి నాయకర్‌తో కలిసి ఇంటింట ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వాన్ని ఎప్పుడు ఇంటికి సాగనంపుదామా అని ప్రజలు ఎదురు చూస్తున్నట్టు తెలిపారు.

నామినేషన్‌కు తరలిరండి: నిమ్మల


విలేకరులతో మాట్లాడుతున్న పాలకొల్లు టీడీపీ కూటమి అభ్యర్థి నిమ్మల

పాలకొల్లు టౌన్, ఏప్రిల్ 18: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఉమ్మడి అభ్యర్థిగా శుక్రవారం నామినే షన్ దాఖలు చేస్తు న్నట్టు పాలకొల్లు ఎమ్మెల్యే డాక్టర్ నిమ్మల రామానాయుడు తెలిపారు. పాలకొల్లు క్యాంపు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయ న మాట్లాడుతూ నామినేషన్ కార్యక్రమానికి టీడీపీ, జనసేన, బీజేపీ నాయ కులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో హాజరవ్వాలని కోరారు. పూల పల్లి వైజంక్షన్ నుంచి సైకిల్ ర్యాలీగా బయలుదేరి అంబేడ్కర్ విగ్రహం, గాంధీ బొమ్మలు సెంటర్, పెదగోపురం మెయిన్‌రోడ్డు మీదుగా పాలకొల్లు మున్సిపల్ కార్యాలయానికి చేరుకుని అక్కడ నామినేషన్ దాఖలు చేస్తా మన్నారు. ప్రతీ ఒక్క కార్యకర్త సైకిల్‌పై వచ్చి ర్యాలీలో పాల్గొనాలని కోరారు. గతంలో స్థాపించిన ధర్మారావు ఫౌండేషన్ ద్వారా అనేక సేవాకార్యక్రమాలు చేపట్టి ప్రజలకు చేరువయ్యానన్నారు. పాలకొల్లు ఎమ్మెల్యేగా 10ఏళ్ల నియోజకవర్గ ప్రజలకు కోవిడ్, వరదలు వంటి విపత్కర పరిస్థితుల్లో తన శక్తి మేరకు సేవలందించానన్నారు.


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వలవల బాబ్జి, బొలిశెట్టి శ్రీనివాస్ తదితరులు

బొలిశెట్టి నామినేషన్‌కు భారీగా తరలిరావాలి

తాడేపల్లిగూడెం అర్బన్, ఏప్రిల్ 18: నియోజకవర్గ కూటమి అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ శుక్రవారం ఉదయం 11 గంటలకు నామినేషన్ వేయనున్నారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తొలుత ఉదయం 9 గంటలకు భైరాగి మఠం గోపాలస్వామి, అంజనేయస్వామిని దర్శించుకుంటారన్నారు. అనంతరం ర్యాలీగా బయలుదేరి ఆర్డీవో కార్యాలయంలో నామినేషన్ వేస్తారన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే అభ్యర్థి బొలిశెట్టి మాట్లాడుతూ నామినేషన్ కార్యక్రమానికి ఆయా పార్టీ శ్రేణులంతా భారీగా తరలివచ్చి తనను ఆశీర్వదించాలని కోరారు. స్థానిక మంత్రి కొట్టు సత్యనారాయణ తీరు ఇంకా మారలేదదని, ఇప్పటికీ కొన్ని సంఘాల వద్దకు వెళ్ళి డబ్బులు డిమాండ్ చేస్తున్నారన్నారు. బీజేపీ కన్వీనర్ ఈతకోట తాతాజీ మాట్లాడుతూ మూడు పార్టీల శ్రేణులు సమన్వయంతో పనిచేసేందుకు నామినేషన్‌తో నాంది పలకాలన్నారు.

పెంటపాడు: తాడేపల్లిగూడెం అభివృద్ధి చెందాలంటే కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని జనసేన నాయకుడు బొలిశెట్టి రాజేష్ కోరారు. గురువారం పెంటపాడులో ప్రజలకు కరపత్రాలను అందజేశారు. కిలపర్తి వెంకట్రావు, దాసరి అప్పన్న, నల్లమిల్లి చినగోపిరెడ్డి, ఉమ్మడి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీనివాసవర్మకు బీ ఫాం అందజేత

భీమవరం, ఏప్రిల్ 18 : 'నరసాపురం లోక్‌సభకు బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేస్తున్న తాను ఎంపీగా గెలుస్తున్నాను.. నా రాజకీయ గురువు పాక వెంకట సత్యనారాయణ చేతులు మీదుగా ఈరోజు బీజేపీ అభ్యర్థిగా బీ ఫాం అందుకోవటంతో ఇంత కాలం కొనసాగిన సస్పెన్స్ తొలగింది' అంటూ నర్సాపురం లోక్‌సభ బీజేపీ అభ్యర్థి భూపతి రాజు శ్రీనివాస వర్మ స్పష్టం చేశారు. బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న శ్రీనివాస్ వర్మకు గురువారం పార్టీ కార్యాలయంలో ఉమ్మడి పార్టీల ముఖ్యనాయకుల సమక్షంలో బి ఫాంను బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ విభాగం చైర్మన్ పాక సత్య నారాయణ చేతుల మీదుగా అందుకున్నారు.

సంక్షేమ నిధి ఏర్పాటు చేస్తా: వర్మ

భీమవరం టౌన్, ఏప్రిల్ 18: పార్లమెంటు నియోజకవర్గం లో అత్యధికంగా ఓట్లు ఉన్నశెట్టిబలిజ గౌడ గీత కులాల సామాజిక వర్గం సంక్షేమం కోసం రూ.5 కోట్ల సొంత నిధులతో ఒక సంక్షేమ నిధి ఏర్పాటు చేస్తానని నరసాపురం లోక్‌సభ బీజేపీ ఉమ్మడి అభ్యర్థి శ్రీనివాసవర్మ ప్రకటించారు. గురవారం గీత కార్మికులు పార్టీ కార్యాలయంలో కలసిన సందర్భంలో ఆయన మాట్లాడారు. ఈ జిల్లాలో తన స్నేహితులందరూ శెట్టిబలిజ,గౌడ,బీసీ కులాలవారే నని చెప్పారు.

వ్యయ పరిశీలకుల రాక

కలెక్టరేట్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్ పరిశీలన

భీమవరం టౌన్, ఏప్రిల్ 18: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జిల్లాకు నియమించిన వ్యయ పరిశీలకులు గురువారం కలెక్టరేట్‌లోని జిల్లా ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్‌ను పరిశీలించారు. సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు సంబంధించి పర్యవేక్షణ నిమిత్తం గురువారం ఉదయం జిల్లాకు చేరుకున్న వ్యయ పరిశీలకులు పియూష్ శుక్ల, మోహన్ అగ ర్వాల్, విక్రమాదిత్య మీన కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ సమిత్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం జిల్లా కలెక్టరేట్‌లోని జిల్లా ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్ లోని అన్ని విభాగాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఎన్నికల వ్యయ పరిశీలకులకు ఎన్నికల సిబ్బంది నిర్వర్తిస్తున్న విధులను గురించి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా పరిశీలకులకు వివరించారు. కంట్రోల్ రూమ్ సేవలపై ఎన్నికల వ్యయ పరిశీలకులు సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా జాయింటు కలెక్టరు సి.వి.ప్రవీణ్ ఆదిత్య, ట్రైనీ డిప్యూటీ కలెక్టరు పీడీ కానాల సంగీత్ మాధుర్ తదితరులు పాల్గొన్నారు.


ఇంట్రిగ్రేటెడ్ కమాండ్ సెంటర్‌లో పరిశీలకులు

అన్నసమారాధన

ఉండి, ఏప్రిల్ 18: వెలివర్రులోని శ్రీవీరపేరటాలమ్మ జాతర ముగింపును పురస్కరించుకుని సుమారుగా 5వేల మందికి అఖండ అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ ఈవో రుద్దరాజు ఫణికిశోర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

భీమవరం టౌన్: శ్రీ రామనవమి సందర్భంగా భీమవరం వన్ టౌన్‌లోని పోలీస్ క్వార్టర్స్ ఆవరణలో ఉన్న రామాలయం వద్ద గురువారంనాడు అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉద్ధరాజు శ్రీనివాసరాజు ప్రారంభించారు. ముందుగా శ్రీ దాసాంజనేయ స్వామి పారాయణ బృందం మహిళలు స్వామివారి సన్నిధిలో పారాయణం చేశారు.

తొలిరోజు నామినేషన్లు నిల్

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 18: తాడేపల్లిగూడెంలో తొలిరోజు ఎలాంటి నామినేషన్‌లు అందలేదని రిటర్నింగ్ అధికారి కె చెన్నయ్య తెలిపారు. నామినేషన్ పత్రాలు కావాల్సిన వారు రిటర్నింగ్ అధికారి కార్యాలయం వద్ద ఉన్న హెల్ప్‌డెస్క్ వద్ద తీసుకోవచ్చని వివరించారు.

ఉండి: ఉండి అసెంబ్లి నియోజకవర్గానికి తొలిరోజు ఒక్క నామినేషన్ కూడా దాఖలుకాలేదని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టరు సీవీ ప్రవీణ్ ఆదిత్య తెలిపారు. ఈనెల 25వ తేదీ వరకు నామినేషన్లు తీసుకోవడం జరుగుతుందన్నారు. అభ్యర్థితో పాటు మరో నలుగురిని మాత్రమే లోపలకు అనుమతించడం జరుగుతుందన్నారు.

11న జాతీయ లోక్ అదాలత్

భీమవరం క్రైం, ఏప్రిల్ 18: వచ్చే నెల 11న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని భీమవరం 3వ అదనపు కోర్టు అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న తణుకు 4వ అదనపు జిల్లా న్యాయమూర్తి డి.సత్యవతి అన్నారు. కోర్టు హాల్‌లో భీమవరం రూరల్, ఆకివీడు, వీరవాసరం, ఎక్సైజ్ ఆకివీడు, కాళ్ళ, పాలకోడేరు కోర్టు ప్రతినిధులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఆయా కోర్టులలో పెండింగ్‌లో ఉన్న రాజీపడదగిన క్రిమినల్ కేసులను గుర్తించి ఇరుపక్షాల వారిని సమన్వయపరిచి లోక్‌అదాలత్ ముఖ్య ఉద్దేశమైన రాజీయే రాజమార్గం ద్వారా ఎక్కువ కేసులు రాజీ చేసే దిశగా పోలీస్ అధికారులు తమ వంతు బాధ్యతగా కృషి చేయాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 18: పెదతాడేపల్లిలో వార్షిక మరమ్మతుల కోసం శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు ఈఈ ఎస్. వెంకటేశ్వరరావు గురువారం తెలిపారు. తాడేపల్లిగూడెం పట్టణం, మండలంతోపాటు, పెంటపాడు మండలాల్లో అన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

పెనుమంట్ర: విద్యుత్ మరమ్మతులు కారణంగా పోలమూరు, నత్తా రామేశ్వరం, జుత్తిగ మల్లిపూడి, సోమరాజు ఇల్లింద్రపర్రు గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.సురేష్ కుమార్ తెలిపారు.

వరి కోతలు త్వరగా పూర్తిచేయాలి

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 18: వరి కోతలు త్వరగా పూర్తిచేయాలని మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్ ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 24 వేల ఎకరాల్లో వరి సాగుచేస్తే ఇప్పటి వరకు 11 వేల ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయన్నారు. రైతులు పంటను వారం నుంచి పది రోజుల్లోపే ఆరబెట్టాలని అంతకు మించి ఆరబెడితే గింజ ముక్కలయ్యే ప్రమాదం ఉందన్నారు. ధాన్యం కోసిన తరువాత ధాన్యం కొనుగోలు కేంద్రాలకు విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు.

41 మంది వలంటీర్లు రాజీనామా

ఆకివీడు, ఏప్రిల్ 18: మండలంలో గురువారం 41 మంది వలంటీర్లు రాజీనామా చేశారని ఎంపీడీవో వై.రామకృష్ణ తెలిపారు. ఆకివీడు-1 సచివాలయంలో 22 మంది, గుమ్ములూరులో 11, చినమిల్లిపాడులో 6, చెరుకుమిల్లిలో ఇద్దరు రాజీనామా చేశారు. ఇప్పటి వరకూ మండంలో మొత్తం 212 మంది రాజీనామా చేశారన్నారు.

నోటీసులివ్వకుండా ఇంటి కూల్చివేత దారుణం


నిరసన తెలుపుతున్న బాధితులు, నాయకులు

తాడేపల్లిగూడెం అర్బన్, ఏప్రిల్ 18: ముందస్తు నోటీసులు ఇవ్వకుండా ఇంటి కూల్చివేతకు పూనుకోవడం దారుణమని టీడీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి గొర్రెల శ్రీధర్ అన్నారు. పట్టణంలోని 6వ వార్డు ఎయిర్ ఫీల్డ్ భూముల్లో నివాసం ఉంటున్న ముత్తా శ్రీనివాస్ ఇంటిని కూల్చేందుకు మున్సిపల్ అధికారులు ఎక్స్‌కవేటర్‌తో రావడంతో బాధితులతో కలసి బైఠాయించి కూల్చివేతను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ ముత్తా శ్రీనివాస్ కుటుంబీకులు చాలా కాలంగా ఈ ప్రాంతంలో నివాసం ఉంటున్నారన్నారు. తాటాకు ఇల్లు శిథిలావస్థకు చేరడంతో గోడలు మరమ్మతులు చేయించుకుంటున్నారన్నారు. ఇప్పుడు అధికారులు వచ్చి కూల్చివేస్తామనడం సబబు కాదని టీడీపీ, జనసేన బాధితులకు అండగా ఉంటాయన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 18: వెంకట్రామన్నగూడెంలో విద్యుత్ పనులు చేస్తుండగా విద్యుదాఘాతంతో కూలీ మృతి చెందిన ఘటన గురువారం జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం పెదతాడేపల్లికి చెందిన గోపి దివాకర్ (25) వెంకట్రామన్నగూడెంలో విద్యుత్ స్తంభంపై పనిచేస్తుండగా అకస్మాత్తుగా విద్యుత్ రావడంతో షాక్ తగిలి కింద పడిపోయాడు. వెంటనే 108లో తాడేపల్లిగూడెంలో ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి ఇటీవలే వివాహం నిశ్చయమైంది. మే నెలలో వివాహం చేయాలనుకున్న సమయంలో దివాకర్ మృతి చెందడం గ్రామస్థులను కలిచివేసింది.

కూలీ మృతి

ఉండి, ఏప్రిల్ 18: విద్యుత్ షార్టు సర్క్యూట్‌కు గురై వ్యక్తి మృతిచెందాడు. ఉండి పోలీసులు అందించిన వివరాలు ఇలా వున్నాయి. ఉండి గ్రామానికి చెందిన సింగూరి నాగరాజు(40)చిలుకూరు గ్రామంలోని జి.శ్రీనివాసరావుకు చెందిన రొయ్యలచెరువులోని పట్టుబడికి వెళ్లాడు. చెరువులో నుంచి గట్టుపైకి ఎక్కుతుండగా పైన రాడ్‌లా కనిపించిన విద్యుత్‌వైర్‌ను పట్టుకోవడంతో షార్టుసర్క్యూట్‌కు గురై మృతిచెందినట్లు తెలిపారు. భార్య మంగ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైటర్ యెషయా తెలిపారు.

కూటమి అభ్యర్థుల విజయం కోసం ప్రచారం

పెనుగొండ, ఏప్రిల్ 18: వడలి గ్రామంలో సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల సారధ్యంలో పార్టీ శ్రేణులు ప్రచారం నిర్వహించి కూటమిపార్టీల పథకాలను వివరించారు. నరసాపురం పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాస వర్మ గుర్తు కమలం పైన, ఆచంట నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి పితాని సత్యనారాయణ గుర్తు సైకిల్ పై ఓట్లు వేసి విజయం చేకూర్చాలని ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కర్రి కృష్ణారెడ్డి, దొడ్డిపట్ల నాగూర్, ఉప్పలపాటి చంటి, గణపతినీడి బుల్లియ్య, అంగర వర ప్రసాద్ ఉన్నారు.


ఓటరు ప్రతిజ్ఞ చేయిస్తున్న నోడల్ అధికారి ప్రభాకరరావు

నూరుశాతం పోలింగ్ లక్ష్యం

భీమవరం టౌన్, ఏప్రిల్ 18: భారతదేశంలో 2014లో పోలింగ్ శాతం 62వరకు ఉందని, 2019నాటికి 67 శాతంకు పెరిగిందని, ప్రస్తుతం తరుణంలో నూరు శాతం పోలింగ్ జరగాలని భారత ఎన్నికల కమిషన్ ప్రయత్నం చేస్తుందని జిల్లా ఎన్నికల నోడల్ అధికారి సీహెచ్ ప్రభాకర్ అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక, జిల్లా రెవిన్యూ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఓటు విలువ దాని ప్రాముఖ్యత పోలింగ్ అంశాలపై అవగాహన కార్యక్రమాలలో భాగంగా డాక్టర్ సీఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో సదస్సు, ఓటు ప్రతిజ్ఞ కార్యక్రమాలను నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సకుమళ్ళ సత్య నారాయణ, నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రాలు ప్రారంభం


మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న పట్టణ సీఐ డి.మంగా దేవి

పాలకొల్లు అర్బన్, ఏప్రిల్ 18 : రేపాక వారి సత్రం వద్ద గురువారం ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని సీఐ డి.మంగాదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్రం చైర్మన్ రేపాక వెంకట వీర్రాజు మాట్లాడుతూ ప్రతీ వేసవిలోనూ బాటసారుల దాహార్తి తీర్చేందుకు గానూ తమ సత్రం ద్వారా సుమారు రెండున్నర నెలలు పాటు మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సత్రం ట్రస్టీలు రేపాక శ్రీనివాసరావు, రేపాక నాగ కృష్ణ బ్రహ్మం, రేపాక కృష్ణ కుమారి, సిబ్బంది బెజవాడ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

- శ్రీ సత్యసాయి సంస్థల ఆధ్వర్యంలో పెద్దగోపురం వద్ద గురువారం ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని కన్వీనర్ ఉండపల్లి వెంకట రామకృష్ణ ప్రారంభించారు. ముందుగా స్వామివారి భజనలు చేసి చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు బి.మోహన్‌రావు, ఆర్. సత్యవతి, కె.సాయలక్ష్మి, అనూరాధ, బొండాడ చినబాబు, వి.లక్ష్మీ నరసింహం పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 16 మంది ఎంపిక

పాలకొల్లు అర్బన్, ఏప్రిల్ 18 : స్థానిక ఛాంబర్స్ డిగ్రీ, పీజీ కళాశాలలో గురువారం దివిస్ లేబొరేటరీస్ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలకు 65 మంది హాజరుకాగా 16 మంది ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి వెంకటేశ్వరరావు తెలిపారు. ఎంపికైన వారికి నెలకు రూ.22వేలు జీతం, పీఎఫ్, గ్రాడ్యుటీ, ఈఎస్ఐ వైద్య సదుపాయం, వార్షిక బోనస్ వంటి సౌకర్యాలు ఉంటాయని తెలిపారు.

సివిల్స్ ర్యాంకర్ చిట్టిబాబుకు అభినందన


కొయ్యే చిట్టిబాబును అభినందిస్తున్న మార్నింగ్ కాఫీ క్లబ్ సభ్యులు

భీమవరం అర్బన్, ఏప్రిల్ 18 : 2024 సివిల్స్ ఫలితాలో ఏపీ శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు కుమారుడు చిట్టిబాబు 833వ ర్యాంకు సాధించి సివిల్ సర్వీసెస్‌కి సెలెక్ట్ అయిన సందర్భంగా భీమవరం మార్నింగ్ కాఫీ క్లబ్ సభ్యులు అభినందించారు. సివిల్స్‌లో ర్యాంకు రావడం జిల్లాకే గర్వకారణమన్నారు. మార్నింగ్ కాఫీ క్లబ్ సభ్యులు బోండా రాంబాబు, ఓలేటి శ్రీనివాస గుప్తా, భట్టిప్రోలు శ్రీనివాస్, కారుమూరి సత్యనారాయణ, కిషోర్, మానేపల్లి వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

రెండు కార్లు ఢీ : ఒకరి మృతి.. మరొకరికి గాయాలు


కార్లు ఢీకొన్న ప్రమాద దృశ్యం

ఏలూరు క్రైం, ఏప్రిల్ 18 : రెండు కార్లు ఢీకొనడంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందారు. భీమవరంలోని గునుపూడికి చెందిన యాళ్ళ హనక్‌వర్ధన్(61) గతంలో చైల్డ్‌వెల్ఫేర్‌లో మేనేజర్‌గా చేసి రిటైర్డ్ అయ్యారు. ప్రస్తుతం న్యాయవాదిగా ప్రాక్టీసు చేస్తున్నారు. తన కారులో గురువారం భీమవరం నుంచి విజయవాడ వెళ్తున్నారు. మార్గమధ్యలో ఏలూరు రూరల్ మండలం కలకుర్రు గ్రామం వద్ద ఎదురుగా కారు అతివేగంగా వచ్చి హనక్‌వర్ధన్ కారును ఢీ కొంది. హనక్‌వర్ధన్ అక్కడికక్కడే మృతి చెందారు. ఢీ కొన్న కారులోని వ్యక్తి గాయాలపాలవ్వడంతో ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్ళారు. ఈ సమాచారం అందుకున్న రూరల్ ఎస్ఐ కె.రాజారెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

కల్యాణోత్సవాలకు అంకురార్పణ


పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పాలకొల్లు అర్బన్, ఏప్రిల్ 18: శ్రీ క్షీరా రామలింగేశ్వర స్వామి వార్షిక కళ్యాణ మహోత్సవాలు ఈసందర్భంగా గురువారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రి 5గంటలకు (తెల్లవారితే శుక్రవారం) స్వామివారి కల్యాణం నిర్వహించనున్నారు. ఈ కల్యాణ ఉత్సవాలు 23వ తేదీ వరకు జరగనున్నాయి శుక్రవారం సాయంత్రం స్వామివారి రథోత్సవాన్ని నిర్వహిస్తారు,

ఘనంగా శ్రీరాముడి రథోత్సవం



ఆకివీడు, ఏప్రిల్ 18: శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా స్థానిక ఎస్ టర్నింగ్ కోదండ రామాలయం ఆధ్వర్యంలో రథోత్సవం గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. పురవీధుల్లో రథం వెళుతుంటే మహిళలు, భక్తులు వచ్చి స్వామిని దర్శించుకొని పూజలు నిర్వహించారు.

వైభవంగా రాజగోపాలస్వామి కల్యాణం

మొగల్తూరు, ఏప్రిల్ 18: మొగల్తూరులో పురాతన రుక్మిణీ సత్యభామా సమేత శ్రీరాజగోపాలస్వామి కల్యాణం గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ప్రతీ ఏటా శ్రీరామ నవమి వెళ్ళిన మరుసటి రోజు స్వామివారిని పల్లకిలో ఊరేగించి కల్యాణం నిర్వహించడం ఆనవాయితీ. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని కల్యాణాన్ని తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

రాములోరి ఊరేగింపు

మొగల్తూరు, ఏప్రిల్ 18: శ్రీరామ నవమి ముగింపు వేడుకలు సందర్భంగా మొగల్తూరులోని మత్స్యకార గ్రామాలైన లాకు పల్లవపాలెం, గుంట పల్లవపాలెం గ్రామాల్లోని సీతారామ లక్ష్మణస్వామి వార్లను గురువారం రాత్రి ప్రత్యేక రథాలపై ఊరేగించారు. ప్రతీ ఏటా రాముల వారి కల్యాణం నిర్వహించిన మరుసటి రోజు రెండు గ్రామాలు పెద్ద రథం, చిన్న రథాలపై స్వామివార్లను శ్రీరామ నామ సంకీర్తనలు చేసి మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించడం ఆనవాయితీ. నేటి తరంలోనూ ఇదే సంప్రదాయాన్ని గ్రామస్థులు కొనసాగించడం పట్ల పలువురు అభినందిస్తున్నారు.

మావుళ్ళమ్మకు 8 గ్రాముల బంగారం బహూకరణ



భీమవరం టౌన్, ఏప్రిల్ 18 : మావుళ్ళమ్మ అమ్మవారికి శృంగవృక్షంకి చెందిన దండు రామకృష్ణం రాజు జయజ్యోతి దంపతులు 8 గ్రాముల బంగారం విరాళంగా అందించారు. ఆలయానికి వచ్చిన దాతలు అమ్మవారిని దర్శించుకోగా ప్రధానార్చకుడు మద్దిరాల మల్లి కార్జునశర్మ పూజలు నిర్వహించి ఆశీర్వచనాలు అందించారు. దేవస్థానం తరుపున అమ్మవారి చిత్రపటాన్ని,శేషవస్త్రం, ప్రసాదాన్ని అందించారు.

కాల్వ, జంగిల్ క్లియరెన్స్ పనులతోనే ఉపాధి


కూలీలతో మాట్లాడుతున్న జక్కంశెట్టి సత్యనారాయణ

పెనుగొండ, ఏప్రిల్ 18: పెనుగొండలో ఉపాధి హామీ పని చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డెల్టా ప్రాంతంలో పంట కాలువలు మురుగు కాలువలు జంగల్ క్లియరెన్స్ లాంటి పనులు ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తున్నాయని అవి కాకుండా రైతులు పంట పొలాల్లో మొక్కలు పెంచే కార్యక్రమం చేపడితే కూలీలకు ఉపాధి పోయి భూ యజమానులకు మేలు జరుగుతుందన్నారు. మండల కార్యదర్శి పూతినీడి పద్మ, కమిటి సభ్యులు షేక్ పాదుషా మాట్లాడుతూ ఇప్పటికే మురుగు కాలువల్లో పంట కాలువల్లో తాగేసి పగులగొట్టి పడేసిన బీరు బాటిళ్ల గాజు పెంకులు పని చేస్తున్న కూలీలకు గాయాలు అవుతున్న పరిస్థితి ఉందన్నారు.

25వ తేదీ వరకు నామినేషన్‌ల స్వీకరణ

భీమవరం టౌన్,ఏప్రిల్ 18: భీమవరం నియోజకవర్గ శాసనసభకు సంబంధించి ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో కే శ్రీనివాసులు రాజు తెలిపారు. గురువారం తన ఛాంబర్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 25వ తేదీ గురువారం వరకు నామినేషన్లు దాఖలు చేయకోవచ్చునని అన్నారు. ఆర్డీవో కార్యాలయంలో నామినేషన్ల ప్రతులను పొందవచ్చునని అన్నారు. అదే విధంగా ఈనెల 26 ఉదయం 11 గంటల నుంచి రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్ల పరిశీలన జరుగుతుందన్నారు. నామినేషన్ ఉపసంహరణ సందర్భంలో ఫారం-5 ద్వారా అభ్యర్థి రాత పూర్వకంగా ఉపసంహరించుకోవచ్చునని, అనంతరం అభ్యర్థులకు గుర్తులు కేటాయించడం జరుగుతుందని అన్నారు. మే 13న ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని తెలిపారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జానకీరామ్

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 18: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని ఉప కుల పతి డాక్టర్ టి. జానకి రామ్ పేర్కొన్నారు. గురువారం వెంకట్రామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం వార్షికోత్సవం సందర్భంగా క్రీడోత్సవాలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం యూ ట్యూబ్‌లో వర్చువల్ క్లాస్‌రూం వీడియోను ప్రారంభించారు. వర్సిటీ అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



పాలకొల్లు, తాడేపల్లిగూడెంలలో అగ్ని ప్రమాదాల నివారణపై డెమో నిర్వహిస్తున్న ఫైర్ అధికారులు

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

పాలకొల్లు అర్బన్, ఏప్రిల్ 18 : అగ్ని ప్రమాదాలు జరిగితే ఏవిధంగా తమను తాము రక్షించుకోవడంతో పాటు సాటి వారిని ఏవిధంగా రక్షించవచ్చునో ప్రతీ వారు అవగాహన కలిగి ఉండాలని సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి వైవీ జానకి రామ్ అన్నారు. స్థానిక ఇండేన్ గ్యాస్ గొడౌన్ వద్ద ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్లు వల్ల అగ్ని ప్రమాదాలు జరిగితే ఏ విధంగా అదుపు చేయాలి అన్న అంశంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ప్రమాదాల సమయంలో తమను తాము రక్షించుకోవడంతో పాటు, మరి కొందరి ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని జానకిరామ్ వివరించారు. గురువారం ఇండేన్ గ్యాస్ గొడౌన్ వద్ద, రిలయన్స్ పెట్రోలు బంకు వద్ద నిర్వహించిన కార్యక్రమంలో జానకి రామ్ మాట్లాడారు. దీనిలో భాగంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించి, అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తూ ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు.

ఆకివీడు: అగ్ని ప్రమాదాలు జరగకుండా నివారించుకోవాలంటే విద్యుత్ వైర్లు ఎప్పటికప్పుడు పరిశీలించుకోవడంతో పాటు గ్యాస్ సిలిండర్లు వంటింట్లో జాగ్రత్తగా ఉంచుకోవాలని అగ్నిమాపకశాఖాధికారి నాగేశ్వరరావు అన్నారు. గురువారం స్థానిక హాస్పటల్, బంకులలో ప్రమాదాలపై డెమో చేసి చూపించారు.

తాడేపల్లిగూడెం రూరల్: అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు పాటించాలో విద్యార్థులకు అవగాహన ఉండాలని అగ్నిమాపక అధికారి జి.వెంకట రామారావు పేర్కొన్నారు. తాడేపల్లిగూడెంలోని ఏపీపీఎస్ఆర్ స్కూల్ విద్యార్థులకు గురువారం అగ్ని ప్రమాదాల నివారణపై డెమోతో అవగాహన కల్పించారు.